విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



టీవీ రిపోర్టర్లు కావలెను
A.P VISION TV
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్‌ఎడిటర్: పేరపోగు వెంకటేశ్వర్లు | మంగళవారం 16-09-2025 | సంపుటి: 11 | సంచిక: 218 | పేజీలు: 8 | వెల: రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## దేశంలోని చొరబాటుదారులను వెనక్కి పంపుతాం




పూర్ణియా: దేశంలోని చొరబాటుదారులందర్నీ తమ ప్రభుత్వం వెనక్కి పంపుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రీయ జనతా దళ), కాంగ్రెస్ పార్టీలు రెండూ బిహార్ ఐడెంటిటీని ప్రమాదంలో పడేస్తున్నాయని విమర్శించారు. ఆర్జేడీ-కాంగ్రెస్ హయాంలో బిహార్ ఇబ్బందుల పాలైందని అన్నారు. పూర్ణియాలో సోమవారంనాడు పలు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, బిహార్ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, ఆర్జేడీ ఓర్వలేకున్నాయని, అందువల్లే అనవసరమైన అంశాలను లేవనెత్తుతున్నాయని ఎద్దేవా చేశారు. అయితే బిహార్ ప్రజలు, ముఖ్యంగా మహిళలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.'ఈ రోజు సీమాంచల్, ఈస్ట్రన్ ఇండియాలో డెమోగ్రాఫిక్ సంక్షోభం తలెత్తింది. బిహార్, బెంగాల్, అస్సాం, చాలా రాష్ట్రాలు తమ ఆడకూతుళ్లు, సోదరీమణుల భద్రతపై ఆందోళనగా ఉన్నాయి. అందుకోసమే ఎర్రకోట నుంచి నేను డెమోగ్రఫీ మిషన్‌ను ప్రకటించాను. కానీ ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్, ఆర్జేడీలు చొరబాటుదారులకు కొమ్ముకాస్తూ వచ్చిన చొరబాటుదారులను కాపాడేందుకు యాత్రలు తీస్తున్నాయి' అని మోదీ విరుచుకుపడ్డారు. సొంత కుటుంబాల గురించి మాత్రమే ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తారని, తాము మాత్రం 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'నే విశ్వసిస్తామని మోదీ చెప్పారు.

## డ్వాక్రా సంఘాల టర్నోవర్ 10 లక్షల కోట్లకు ఎదగాలి

### సీఎం చంద్రబాబు

మహిళా సాధికారత కోసం తీసుకు వచ్చిన డ్వాక్రా సంఘాలు మరింత ఎత్తుకు ఎదగాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. తాజాగా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. తాను ప్రారంభించిన డ్వాక్రా సంఘాలను ఎవరూ ఏం చేయలేకపోయారని, పొదుపు చేసి దాచుకున్న డబ్బులతో పాటు రివాల్వింగ్ ఫండ్ ద్వారా మహిళా సంఘాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాల రూపంలో కోటి 20 లక్షల మందితో కూడిన అతిపెద్ద మహిళా సైన్యం రాష్ట్రానికి ఉందని అన్నారు (మహిళా సంఘాలకు రుణం ఇస్తే డబ్బులు బ్యాంకులో ఉన్నట్టేనని, డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లకు ఎదగాలని ఆశిస్తున్నానని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవంతంగా డ్వాక్రా సంఘాలను నిర్వహిస్తున్న సెర్ప్ ఉన్నతాధికారులను అభినందించారు తిని సంక్షేమ శాఖలు, పీ4 తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సీఎం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సంక్షేమ హాస్టళ్లను కలెక్టర్లు తప్పనిసరిగా సందర్శించాలని, విద్యార్థులకు ఇచ్చే ఆహారం, నీరు, దుప్పట్లు, మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని సూచించారు పీ4 అనేది మరో గేమ్ చేంజర్ కార్యక్రమం అని, వాలంటరీగానే అంతా ముందుకు రావాలి తప్ప ఎవరినీ బలవంతం చేయాల్సిన అవసరం లేదని సీఎం సూచించారు. పీ4, డ్వాక్రా, మెప్మాను



ఇంటిగ్రేట్ చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అన్ని మార్గాలను వినియోగించుకుందామని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల్లో తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. 1.2 కోట్ల కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకువెళ్తే వ్యవస్థే మారుతుందని, దేశానికి ఇదో మోడల్‌గా నిలుస్తుందని అన్నారు.

## ఏపీలో ఐఏఎస్ అధికారుల బదిలీలు.. పోస్టింగ్‌లు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగు రోజులుగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ఇవాళ మరి కొంతమంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ముగ్గురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి. దాత్రి రెడ్డిని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓగా బదిలీ చేశారు.

కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న గీతాంజలి శర్మను ఏపీ ఫైబర్‌నెట్ ఎండీగా నియమించారు.

పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శౌర్యమాన్ పటేల్‌ను మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ఎండీగా బదిలీ చేశారు.




## యూరియా వాడకం తగ్గించండి

**క్యాన్సర్‌కు అదే ప్రధాన కారణం**

**యూరియా తగ్గిస్తే 800 నగదు ప్రోత్సాహకం**

**కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు ప్రకటన**



అమరావతి,సెప్టెంబర్15: ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. తగ్గించే ప్రతి కట్టకు రూ.800 నేరుగా రైతుకు అందిస్తామని చెప్పారు. రైతు నష్టపోకూడదు, ప్రజారోగ్యం బాగుండాలని పేర్కొన్నారు. కలెక్టర్ల సదస్సులో వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా ఎక్కువ వాడటం వల్ల క్యాన్సర్ వస్తుంది. దీని వాడకంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలి. ఏపీలో క్యాన్సర్ టాప్-5 రోగాల జాబితాలో ఉంది. వాడకం ఇలాగే కొనసాగితే క్యాన్సర్‌లో నంబర్-1కి వెళ్లిపోతాం. వచ్చే ఏడాది నుంచి ఎంతవరకు అవసరమో అంతే వినియోగించాలి. మైక్రో న్యూట్రియంట్స్ సప్లిమెంట్స్ కింద ఇవ్వాలి. యూరియా ఎక్కువ వాడితే ఎక్కువ పంట వస్తుందనుకోవడం సరికాదు. దీని అతివాడకంపై పంజాబ్‌ను కేస్ స్టడీగా చూడాలని చంద్రబాబు తెలిపారు. యూరియా వాడితే అధిక దిగుబడి వస్తుందనడం కరెక్ట్ కాదు అన్నారు. దీనికి పంజాబ్‌ను కేసు స్టడీగా తీసుకోవాలని సూచించారు. యూరియాను అవసరం మేరకే వాడాలని తెలిపారు. అయితే, రైతులు వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకాన్ని తగ్గిస్తే, ఆ మేరకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పుకొచ్చారు. కాగా, ప్రస్తుతం వాడుతున్న యూరియాను తగ్గించే ప్రతి కట్టకు రూ. 800 నేరుగా రైతులకు అందజేస్తామని వెల్లడించారు. మన రైతులు ఎక్కువ ఎరువులు వాడుతున్నారు, దాని వల్ల మిరప పంటను చైనా తిప్పి పంపించిందన్నారు. అలాగే, కొన్ని యూరప్ దేశాలు కూడా మన ఉత్పత్తులపై ధరలను తగ్గిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేశారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకీలక ఆదేశాలు

**పలు సవరణల్లో ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు**

**చట్టసవరణను నిలిపివేయాలన్న పిటిషన్లపై విచారణ**

న్యూఢిల్లీ,సెప్టెంబరు15 : వక్ఫ్ సవరణచట్టం-2025 లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు-ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు-నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ)చట్టం-2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉండటం మంచిదని పేర్కొంది. ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకొనేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు- ఆక్రమణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.

## అన్ని రంగాల్లో మహిళలు టాప్.. అయ్యన్న ప్రశంసలు

తిరుపతి, సెప్టెంబరు 15: ఏ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా నారీమణులు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దిశానిర్దేశం చేశారు. మూడు సంవత్సరాల తర్వాత జాతీయ మహిళా సదస్సును ఏపీ రాజధాని అమరావతిలో నిర్వహించుకోవటానికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికీ అమరావతి పూర్తయిపోతుందని ఉద్ఘాటించారు. ఇవాళ(సోమవారం) తిరుపతిలో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సు రెండో రోజు కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చింతకాయల అయ్యన్న పాత్రుడు పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రముఖులు ఇచ్చిన సూచనలు



మహిళల్లో ఆత్మవిశాసం పెంచేలా ఉన్నాయని నొక్కిచెప్పారు. ఈ సదస్సులో చాలా గొప్పగా చర్చలు జరిగాయని వెల్లడించారు. చర్చలు తనకు ఆనందాన్ని కలిగించాయని చెప్పుకొచ్చారు. పురుషులతో భాగంగా మహిళలకు సమాన హక్కులు ఏపీలో ఇప్పటికే ఇచ్చామని గుర్తుచేశారు. ఇది ఏపీకి మాత్రమే పరిమితం కాకూడదని... దేశం మొత్తం అమలయ్యేలా తీర్మానం చేసి అది అమలయ్యేలా చేయాలని సూచించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అధికారంలోకి వచ్చాకే మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యం మొదలైందని గుర్తుచేశారు అయ్యన్న పాత్రుడు.తాను ఎమ్మెల్యే అయినప్పుడు గ్రామస్థాయిలో కూడా మహిళా ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఏపీ అసెంబ్లీలో 22 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారని ఉద్ఘాటించారు. సమాజం గురించి మహిళను ఎడ్యుకేట్ చేస్తే ఏ గ్రామమైనా అభివృద్ధి చెందుతోందని నొక్కిచెప్పారు. సురక్షిత సమాజ నిర్మాణం ఏ రాష్ట్రానికైనా ముఖ్యమని వ్యాఖ్యానించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సమావేశాలు జరగాలని ఆకాంక్షించారు. అందరూ కలిసి పని చేస్తే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

## సమాజాభివృద్ధికి మహిళా సాధికారతే ముఖ్యం

**వారితో కుటుంబమే కాదు..సమాజపురోగతీ సాధ్యం**

**మహిళా సాధికారిత సదస్సులో గవర్నర్ నజీర్**

తిరుపతి,సెప్టెంబర్15: మహిళా సాధికారత కేవలం మహిళలనే కాదు.. సమాజాన్నీ వృద్ధి పథంలో నడిపిస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. వారికి గౌరవం లేని చోట ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు.తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు పురాణాల్లో కనిపించవని చెప్పారు. మన వేదాలు, ఉపనిషత్తులు మహిళలను గౌరవించాలని చెబుతున్నాయన్నారు. కుటుంబ సంతోషం ఆ ఇంట్లో మహిళల ఆనందంపై ఆధారపడి ఉంటుంది. ఇదే రాష్ట్రానికి, దేశానికి వర్తిస్తుంది. మొల్ల రామాయణం రాసిన కవయిత్రి మొల్లకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. కేవలం ఆస్తుల్లో భాగస్వామ్యం లేకపోవడం వల్ల మహిళలు చాలా సార్లు తండ్రి, సోదరుడు, భర్తపై ఆధారపడతారు. పురుషాధిక్యత సమాజంలో వారికి రెండో స్థానం ఇచ్చారు. కానీ సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లుఅ అని అన్నారు. భారత రాజ్యాంగం అందరినీ సమానంగా గుర్తిస్తుంది. లింగ సమానత్వానికి రాజ్యాంగంలో ప్రాధాన్యత



ఉంది. మహిళలు ఎన్నో సవాళ్లను దాటి రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు గట్టి పోటీ ఇస్తున్నారు. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో వారి హక్కులను కాపాడేలా తీర్పులు ఇచ్చింది. ఆయా తీర్పులు హక్కులను కాపాడటంలోనే కాదు, సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించాయి. ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 14 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. రువాండాలో 30 శాతం పార్లమెంటరీ సీట్లు- కేటాయిస్తూ చట్టం చేసిన కొద్ది కాలానికే అక్కడ వృద్ధి పెరిగింది.

# సంపాదకీయం

మంగళవారం 16-09-2025

## విమోచన అంటే ఉలికిపాటు ఎందుకో?

తెలంగాణ విమోచన అనగానే పాలకులు ఉలిక్కిపడుతున్నారు. ఏదో పేరు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జరుపుకోవడానికి జడుస్తున్న నేతలు ఉన్నందుకు మనం సిగ్గుపడాలి. బాజాప్తా ఎందుకు విమోచన జరపలేక పోయారో తగ పాలకులు, నేటి పాలకులు సమాధానం ఇచ్చుకోవాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా,రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవంజరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. విమోచన దినోత్సవం జరపడం అంటే దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి ఘటనల్లో మరణించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన దినం జరపడం అన్నది తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశత్వం మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్నప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాం ను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరఫున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్‌వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మ లను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడానికి కూడా సిద్దం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగిపోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థనం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతన్న అరాచాకాలను అందరూ ఎదరించి ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యా నికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు.లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగింది భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడం తో పాటు, ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు.

# నేపాల్... అంతా స్వయం కృతాపరాధమే

ఖాట్మాండు, సెప్టెంబర్ 15, నేపాల్.. ప్రపంచంలో ఏకైక హిందూ దేశం. రాచరికం నుంచి ప్రజామ్యంగా పరిణామం చెందినా ఇప్పటికీ అక్కడ సుస్థిర ప్రభుత్వం లేదు. కేవలం 3.5 కోట్ల జనాభాకు సుస్థిర పాలన అందించడంలో అక్కడి నేతలు విఫలమవుతున్నారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే అధికారాన్ని వాడుకుంటున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక వీరి పిల్లలు వేసే వేషాలు మామూలుగా ఉండడం లేదు. తమ తల్లిదండ్రుల సంపాదించిన సొమ్ముతో విదేశాల్లో విలాసాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా చెలరేగిగన ఆందోళనలు ఆ దేశ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి. జనరేషన్ జెడ్ (జెన్ జెడ్) నేతృత్వంలో మొదలైన ఈ పోరాటం, అవినీతి, ఆర్థిక అసమానతలపై దృష్టి సారించడంతో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. సోషల్ మీడియా నిషేధం ఈ తిరుగుబాటుకు ఊపందుకునేలా చేసింది, ఫలితంగా ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. ఈ సంఘటనలు యువత ఆగ్రహాన్ని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, సామాజిక మార్పు అవసరాన్ని సూచిస్తున్నాయి.నేపాల్‌లో యువత నిరుద్యోగం ఒక ప్రధాన సమస్యగా మారింది. 15?24 సంవత్సరాల దాటిన యువతలో 20.8% మంది నిరుద్యోగులుగా ఉన్నారు, ఇది వారిని విదేశాలకు వలసలు వెళ్లేలా చేస్తోంది. దేశంలో చేరుకున్న వార్షిక ఆదాయం సగటున 1,400 డాలర్లు మాత్రమే, 20% ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాజకీయ నేతల కుటుంబాలు విలాసవంతమైన జీవితాలు గడపడం యువతలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికల ప్రకారం, నేపాల్ ఆసియాలో అవినీతి ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటి. ఈ అసమానతలు యువతను రోధాలకు దూరం చేసి, పొలిటికల్ 'నెపో కిడ్స్' (నెపోటిజం పిల్లలు)పై దృష్టి పెట్టేలా మార్చాయి.గత వారాల్లో, సోషల్ మీడియాలో 'నెపో కిడ్స్' ట్రెండ్ వైరల్ అయింది. ఇది రాజకీయ నేతల పిల్లల విలాస జీవనశైలిని టార్గెట్ చేసింది. మాజీ మంత్రి కుమార్తె శ్రింఖల ఖతీవాడ, మాజీ ప్రధాని కోడలు శివానా శ్రేష్ఠ, ప్రచండ మనవరాలు స్మితా దహాల్ వంటి వారి ఖరీదైన దుస్తులు, విదేశీ పర్యాటనలు, లగ్జరీ వస్తువులు ఎక్స్‌పోజ్ అయ్యాయి. చఔవజూనీఃజీఎతివబఔవజూజీశ్రీ హ్యాష్‌ట్యాగ్ మిలియన్ల వ్యూస్ సాధించింది, ఇది యువత ఆగ్రహాన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు మార్చింది. ఈ క్యాంపెయిన్ టిక్‌టాక్, ఇన్‌స్ట్రాగామ్, ఎక్స్ వంటి సైట్లలో వ్యాపించి, సామాన్య ప్రజల బాధలతో పోల్చి సెటైర్‌లు, వీడియోలు సృష్టించింది. దీని పరిణామంగా, కొందరు తమ అకౌంట్లు మూసివేశారు, మరికొందరు ఆన్‌లైన్ యాక్టివిటీ ఆపేశారు.మీడియా నిషేధం (26 ప్లాట్‌ఫారమ్‌లపై) ఈ ట్రెండ్‌ను అడ్డుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యగా కనిపించింది. కానీ ఇది యువతను రోధాలకు దారి తీసింది. సెప్టెంబర్ 8న కాఠ్మండూలో మొదలైన నిరసనలు పార్లమెంట్ భవనంపై దాడులు, మంత్రుల ఇళ్లపై దాడులుగా మారాయి. పోలీసులు టియర్ గ్యాస్, రబ్బర్ బులెట్లు, లైవ్ ఫైరింగ్ ఉపయోగించడంతో 19?31 మంది మరణించారు, వేలాది మంది గాయపడ్డారు. ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించి, కర్ఫ్యూ విధించింది, ఇది హింసను మరింత పెంచింది. ఈ ఘటనలు యువత ఆందోళనలను అవినీతి వ్యతిరేక పోరాటంగా మాత్రమే కాకుండా, ప్రభుత్వ దమనపరమైన విధానాలపై తిరుగుబాటుగా మార్చాయి.హింసాత్మక ఆందోళనలు ప్రధాని కేపీ శర్మ ఓలీని రాజీనామా చేయించాయి. ఇది దశాబ్దాల్లో అరుదైన మార్పును తీసుకొచ్చింది. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ మధ్యవర్తిత్వం చేస్తూ, యువత నేతలతో చర్చలు జరుపుతున్నారు. సైన్యం పహారా విధించి, రాజ్యాంగపరమైన పరిష్కారాలు కోరుతోంది. యువత డిమాండ్లు: అవినీతి విచారణలు, రాజ్యాంగ మార్పులు, మరణించినవారి కుటుంబాలకు సహాయం, ఆస్తులపై దర్యాప్తు. మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కార్కి ఇంటరిమ్ పీఎంగా ఎంపిక అయినట్లు ట్రెండింగ్, ఇది యువత ఆశలకు కొత్త ఆకారాన్ని ఇస్తోంది.

# రాతియుగపు పరిశోధకుడు రాజారామ్ సింగ్

**- ఇంటినే మ్యూజియంగా మార్చిన చరిత్రకారుడు**

**- బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు**


**- అమర భారతిగా ప్రపంచం గుర్తించిన మన జిల్లా ముద్దు బిడ్డ**

**- రాజారాంసింగ్ జయంతిపై ప్రత్యేక కథనం...**

.పెద్దపల్లి ,రాతియుగపు ఆనవాళ్లను పరిశోధిస్తూ అంతర్జాతీయంగా ఎందరో పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచిన ప్రముఖ ఆర్కియాలజిస్టు ఠాకూర్ రాజారాం సింగ్ (అమరభారతి) చరిత్ర పుటల్లో నిలిచిన మన పెద్దపల్లి జిల్లా ముద్దుబిడ్డగా కీర్తించడం మనకెంతో గర్వం కారణం. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోదుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో కీలకపాత్ర వహించి న్యాయవాదిగా అందరికి సుపరిచితమే. ముఖ్యంగా అర్కియాలజిలో అద్భుతాలు సాధించి దేశవిదేశాల రిసెర్చ్ స్కాలర్స్ మన్ననలు పొందారు. రాజారాం సింగ్ 1928 సెప్టెంబర్ 15న పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని శివాలయం వీధిలో ఠాకూర్ నారాయణసింగ్, కృష్ణా బాయిలకు జన్మించారు. కవి, రచయిత, చరిత్ర పరిశోధకునిగా రాణించారు. ఈయన స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ తిరస్కరించారు. అలాగే అమరభారతి అనే కలం పేరుతో ఆంగ్లంలోను, ఉర్దూలోను తెలుగులోను కవితలు, వ్యాసాలు రాసాడు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం సంపుటిని ఉర్దూ , ఆంగ్లంలోకి అనువదించాడు. పూణేలో దక్కన్ కాలేజీలో పీహెచ్ డీ పట్టా పొందిన రాజారామ్ సింగ్ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. శాతవాహనుల రాజధాని కోటి లింగాలను దాని నేపథ్యాన్ని శాతవాహను ల కాలం నాటి ఆనవాళ్లను, వారు ఉపయోగించిన పనిముట్లను పరిచయం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతం వెంట నడుచుకుంటూ వెళ్లి రాతియుగం నాటి మనిషి ఆనవాళ్లు పాదముద్రలను సేకరించారు. అలాగే రాకాసి బల్లి ఆనవాళ్లను మొదటిసారి సేకరించిన చరిత్రకారునిగా నిలిచారు. పెద్దపల్లి జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న పెద్దబొంకూర్ గ్రామంలో గల శాతవాహనుల చారిత్రక ఆనవాళ్లను నాణేలను సేకరించి ఆనాటి చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి ఆంగ్లంలో ఒక పుస్తకంగా మలిచారు. కోటిలింగాలలోనూ ఆయన పరిశోధన మేరకే అక్కడ తవ్వకాలు జరిపారు. గోదావరి పరివాహకపు ప్రాంతాల్లో ఆదిను మానవుడి సంచారం, పాదముద్రలు, రాతి పనిముట్లు సేకరించి ప్రపంచానికి పరిచయం చేశాడు. రాకాసి బల్లిని కనుగొన్న వ్యక్తిగా రాజా రామ్ సింగ్ ప్రసిద్ధి. అనేక ఆనవాళ్లను తవ్వకాల ద్వారా సేకరించి, నాటి చారిత్రక అంశాలను పొందుపరిచి తన ఇళ్లునే మ్యూజియంగా మార్చారు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు. పె ద్దబొంకూర్ లో నాణాలను సేకరించి బౌద్ధ జైన ఆనవాళ్లను మన ముందుంచాడు. దూళి కట్ట బౌద్ధస్థూపం ప్రత్యేకతను వివరించాడు. ఆయన రచనలను ఏసోర్స్ ఆఫ్ మెటీరియల్ ఇజం అనే పేరుతో ఆంగ్లంలో ఒక పుస్తకంగా తీశారు. 27 జూలై 2003 గుండెపోటుతో మరణించాడన్న వార్త సాహిత్య ప్రపంచాన్ని ఒక్కసారిగా కుదిపివేసింది. ఆయన మరణ వార్త విన్న తర్వాత ఎందరో పాశ్చాత్య ఆర్కియాలజిస్టులు ఇక్కడికి వచ్చి, చారిత్రక పరిశోధనలు, శివాలయం వీధిలోని తన ఇంటిని సందర్శించి పోయారు.చరిత్రకారులు మలయశ్రీ లాంటి మహానుభావులందరూ ఆయనతో ఉన్న పరిచయాల ను ప్రజలకు సాహితీ ప్రపంచానికి వివరిస్తుంటే ఇంతటి గొప్ప మహనీయుడు పెద్దపల్లి జిల్లాలో ఉన్నారా అంటూ విస్తుపోవడం మన పాలకులకే సాధ్యం. ప్రస్తుతం పెద్దపల్లి ప్రజల ముందు ఉన్న ఒకే ఒక ప్రశ్న ఎల్లమ్మ చెరువు ట్యాంక్ బండ్లపై ఠాకూర్ రాజారాం సింగ్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఠాకూర్ రాజారాం సింగ్ మెమోరియల్ గా ఒక మ్యూజియంలో ఏర్పాటు చేసి ఆయన సేకరించిన ఆనవాళ్లను అందులో పొందుపరచాలని పలువురు జిజ్ఞాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ రాజకీయ పబ్బం కోసం ఎంతోమంది నాయకుల విగ్రహాలను ప్రతిష్టిస్తున్న రాజకీయ నాయకులు ఒక మహా మేధావి రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి, చరిత్రకారుని విగ్రహం ఏర్పాటు చేయడంలో తాత్సరం చేయవద్దని పలు వర్గాల ప్రజలు కోరుతున్నారు.

# వారసులకే కమలంలో అవకాశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, అందరివి నలుపు మరకలే. ప్రతి ఒక్కడూ ఆ తానులో ముక్కలే" వెనకటికి ఓ సినిమాలో బహుళ ప్రాచుర్యం పొందిన డైలాగ్ అది. అది నేటి రాజకీయాలకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కమలం పార్టీలో చోటు చేసుకున్న




మార్పులకు అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. ఉదయం లేస్తే కమలం పార్టీ నాయకులు ఇతర పార్టీ నాయకులను తిడుతుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని.. కుటుంబ సభ్యులకే పదవులు ఇస్తున్నారని మండిపడుతుంటారు. ఇన్నాళ్ళ వరకు బిజెపి ని ఈ విషయంలో కార్నర్ చేసే అవకాశం మిగతా పార్టీలకు లభించలేదు. అయితే ఇప్పుడు బీజేపీ నే అవకాశాన్ని మిగతా పార్టీలకు దర్జాగా ఇచ్చేసింది.తెలంగాణలో అధికారంలోకి రావాలని.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బలమైన నిర్ణయంతో ఉంది బిజెపి. ఇప్పటికే గులాబీ పార్టీని మట్టి కరిపించామని.. త్వరలో కాంగ్రెస్ పార్టీని కూడా గద్దె దింపుతామని బిజెపి నాయకులు బలమైన నమ్మకంతో ఉన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బలంగా కోరుకుంటున్నారు. వారి కోరికలు నెరవేరుతాయా.. వారు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటారా.. అనే విషయాలను పక్కన పెడితే తెలంగాణ బిజెపిలో ఇటీవల కొంతమందికి పదవులు ఇచ్చారు. అవి పార్టీకి సంబంధించిన పదవులు. అయితే ఆ పదవులు పొందిన వారిలో కొంతమంది పేర్లను పరిశీలిస్తే ఆశ్చర్యం అనిపించింది. అద్భుతం కూడా అనిపించింది. వారసత్వ రాజకీయాలకు బిజెపి దూరమని. బిజెపి అటువంటి వాటిని ప్రోత్సహించదని పదేపదే కమల నేతలు చెబుతుంటారు. కానీ వాస్తవానికి కమలం పార్టీ కూడా మిగతా వాటి మాదిరిగానేనని.. పైగా వారసత్వాన్ని పెంపొందించే విషయంలో బిజెపి పీహెచ్డీ చేసిందని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి.పార్టీకి సంబంధించిన పదవుల విషయంలో మీడియాకు ఓ జాబితా అందింది. అందులో మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కొడుకు తుళ్ల వీరేంద్ర గౌడ్ కు పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ పదవి ఇచ్చారు. మాజీమంత్రి పోతుగంటి రాములు కొడుకు భరత్ ప్రసాద్ కు కూడా స్టేట్ సెక్రటరీ పదవి ఇచ్చారు. పోతుగంటి రాములు గతంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి పార్లమెంట్ సభ్యుడిగా పని చేశాడు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి కి సెక్రెటరీగా ప్రమోషన్ ఇచ్చారు. మాజీ మంత్రి రామచంద్ర రావు కోడలు కరణం ప్రణీతకు కు సెక్రటరీ పోస్ట్ ఇచ్చారు. బద్దం మహిపాల్ రెడ్డి కొడుకు బద్దం బాల్రెడ్డికి మంచి పోస్ట్ ఇచ్చారు. పీవీ నరసింహారావు మనవడు, గులాబీ పార్టీ ఎమ్మెల్సీ వాణిదేవి అక్క కొడుకు ఎన్వి సుభాష్ కు చీఫ్ స్పోక్స్ పర్సన్ పదవి ఇచ్చారు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బొమ్మ వెంకన్న బిడ్డ జయశ్రీకి కీలకమైన పోస్ట్ కట్టబెట్టారు.

# పాకిస్తాన్ కు తీవ్ర అవమానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్ తో క్రికెట్ ఆడటాన్ని సగటు భారతీయుడు తప్పు పట్టాడు. క్రికెట్ అభిమానులయితే భారత జట్టు మేనేజ్మెంట్ మీద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రక్తం, నెత్తురు కలసి ప్రవహించలేవు అని చెప్పినవారు.. ఇప్పుడు ఎందుకు క్రికెట్ ఆడుతున్నారంటూ విమర్శించారు. సోషల్ మీడియాలో ఒక ఉద్యమాన్ని కూడా నడిపారు. మైదానంలో కాదు, చివరికి టీవీలో కూడా మ్యాచ్ చూడకూడదని తీర్మానించుకున్నారు. అయితే టీమిండియా ద్వైపాక్షిక సిరీస్ ఆడటం లేదని.. కేవలం న్యూట్రల్ వేదిక మీద మాత్రమే సిరీస్ ఆడుతోందని.. అది కూడా ఐసీసీ నిర్వహిస్తున్న మెగా టోర్నీ అని.. ఇందులో వివాదానికి తావు లేదని కేంద్ర క్రీడా శాఖ మంత్రి, బిసిసిఐ క్లారిటీ ఇచ్చాయి. అయినప్పటికీ వ్యతిరేక ఉద్యమం ఆగలేదు.మైదానంలోకి ప్రేక్షకులు భారీగానే వచ్చారు. టీవీలలో కూడా మ్యాచ్ ను భారీగానే వీక్షించారు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు ముందు బ్యాటింగ్ ఎంచుకుంది.. భారత బౌలర్లు పిచ్ మీద ద్యూ ను సద్వినియోగం చేసుకొని అద్భుతంగా బౌలింగ్ వేశారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ జట్టును 127 పరుగులకు పరిమితం చేశారు. కులదీప్ మూడు, అక్షర్, బుమ్రా చెరి రెండు వికెట్లు దక్కించుకున్నారు. పాకిస్తాన్ జట్టులో ఫర్హాన్ 40, అఫ్రీది 33 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో అఫ్రిది 16 బంతుల్లో నాలుగు సిక్సర్లు కొట్టి 33 పగులు చేయడంతో పాకిస్తాన్ ఆమాత్రమైన స్కోర్ చేయగలిగింది.అనంతరం 128 పరుగుల విజయ లక్ష్యంతో రంగంలోకి దిగిన టీమిండియా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. తొలి ఓవర్ నుంచి పాకిస్తాన్ మీద ఎదురుదాడికి దిగడం మొదలు పెట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31) దుమ్మురేపాడు. మరో ఓపెనర్ గిల్(10) నిరాశపరచాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (47×), తిలక్ వర్మ (31), శివం దుబే(10×) సత్తా చూపించడంతో భారత జట్టు 15.5 ఓవర్లలో మూడు వికెట్ల కోల్పోయి టార్గెట్ ఫినిష్ చేసింది. ఈ విజయం ద్వారా టీమిండియా టాప్ 4 లోకి చేరుకుంది.. అయితే ఈ ఓటమి తర్వాత పాకిస్తాన్ జట్టుకు మరో షాకిచ్చింది టీం ఇండియా. టాస్ వేసే ప్రక్రియలో పాకిస్తాన్ కెప్టెన్ గెలిచినప్పటికీ.. అతడికి టీమ్ ఇండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. మ్యాచ్ గెలిచిన తర్వాత భారత ప్లేయర్లు పాకిస్తాన్ ప్లేయర్లతో షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ఆసక్తి చూపించలేదు. క్రికెట్ నిబంధనల ప్రకారం మ్యాచ్ గెలిచిన తర్వాత ఓడిన, గెలిచిన జట్లు కరచాలనం చేసుకొంటాయి. గెలిచిన జట్టును ఓడిన జట్టు అభినందిస్తుంది. కానీ ఆదివారం నాటి మ్యాచ్లో ఇది ఏదీ చోటు చేసుకోలేదు. దీనిని బట్టి పహల్గాం దాడికి సరైన రివెంజ్ తీర్చుకున్నట్టు అయిందని భారత అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

# సిటీ అస్తవ్యస్తం

**ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయం**

హైదరాబాద్, సెప్టెంబర్ 15, హైదరాబాద్ నగరంలో నెల రోజులుగా ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్స్‌ను అధికారులు కత్తిరించడంతో ఈ సమస్య తలెత్తింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేలాడే తీగలను తొలగించాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలు, ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల సచివాలయం వంటి కీలక సంస్థల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యుత్ స్తంభాలపై సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవైన ఇంటర్నెట్, కేబుల్ టీవీ, మరియు టెలిఫోన్ కేబుల్స్ ఉన్నాయి. ఈ కేబుల్స్ నగర జీవనానికి అత్యవసరమైనవి. అయితే, వేలాడే తీగలు వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఇటీవల రామాంతాపూర్‌లో జరిగిన ప్రమాదం వంటి సంఘటనలు జరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీని పరిష్కారంగా, కోర్టు ఆదేశాలతో అధికారులు కేబుల్స్‌ను తొలగిస్తున్నారు. కానీ, ఈ చర్యలు సమస్యను పరిష్కరించడానికి బదులు, సచివాలయం వంటి కీలక ప్రాంతాల్లో సేవల నిలిచిపోవడానికి దారితీశాయి. వర్క్ ఫ్రం హోం ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హైకోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో అధికారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కేబుల్స్‌ను నిర్వహించే ఆపరేటర్లు లేదా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లపై చర్యలు తీసుకోవడానికి బదులు, అధికారులు కేబుల్స్‌ను నేరుగా కత్తిరించడం ద్వారా ప్రజలకు సేవలను ఆపేస్తున్నారు. ఇది ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తోంది. టీవీ ప్రసారాలు నిలిచిపోవడం, ఫోన్ సేవలు అందుబాటులో లేకపోవడం, మరియు ఆన్‌లైన్ తరగతులకు అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ చర్యలు చిన్న వ్యాపారాలను మూతపడే పరిస్థితికి తీసుకొస్తున్నాయి.ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ సేవలు నీటి, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాలుగా మారాయి. చట్టప్రకారం, బిల్లులు చెల్లించే ప్రజలకు ఈ సేవలు అందించడం సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత. అయితే, అధికారుల నిర్ణయాలు ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సుప్రీం కోర్టు కూడా ఇంటర్నెట్ సేవలను అంతరాయం కలిగించడం ప్రజల హక్కుల ఉల్లంఘనగా పరిగణించింది. అయినప్పటికీ, హైదరాబాద్‌లో ఈ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.ఈ సమస్యకు పరిష్కారంగా, అధికారులు కేబుల్ నిర్వాహకులు, సర్వీస్ ప్రొవైడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. వేలాడే తీగల సమస్యను పరిష్కరించడానికి కేబుల్స్‌ను సరిగ్గా నిర్వహించేలా నిబంధనలు అమలు చేయాలి,

# టూ టైర్ సిటీస్ లో ఉగ్రజాడలు

నిజామాబాద్, సెప్టెంబర్ 15, భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు గతంలో పెద్ద నగరాల్లోనే పరిమితమై ఉండేవి. కానీ ఇటీవలి సంఘటనలు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ ఈ ముప్పు విస్తరిస్తున్నట్లు సూచిస్తున్నాయి. ఇక పట్టుబడుతున్నవారిలో 30 ఏళ్లలోపు యువత ఉండడం మరింత ఆదోళన కలిగిస్తోంది. తాజాగా ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్, ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఐసిస్ (ఐఎస్ఐఎస్) లింక్స్‌తో ఉన్న ఐదుగురు యువకులు అరెస్టయ్యారు. ఈ మాడ్యూల్ ఢిల్లీలో బాంబు దాడులు, విధ్వంసకర కార్యకలాపాలు చేపట్టేందుకు సిద్ధమవుతుందని పోలీసులు వెల్లడి చేశారు. ఈ అరెస్టులు దేశవ్యాప్తంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌ల వ్యాప్తిని, ముఖ్యంగా తెలంగాణ, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల్లోని చిన్న పట్టణాలకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది.తాజా ఆపరేషన్ ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్‌కు రహస్య సమాచారం ఆధారంగా ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి ముంబై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రాంచీలోని ఆషర్ దానిష్‌ను కలవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈ ఇద్దరు, ముంబైకు చెందిన అఫ్తాబ్ కురేషీ, సుఫియాన్ అబుబాకర్ ఖాన్, ఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద అరెస్టయ్యారు. వీరి వద్ద సెమి?ఆటోమేటిక్ పిస్టల్స్, 50 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, దేశీయ తుపాకీ, ఎయిర్ గన్ పట్టుకున్నారు. రాంచీలో దానిష్‌ను పట్టుకున్నప్పుడు అతని లాడ్జ్‌లో బాంబు తయారీకి ఉపయోగపడే కెమికల్స్(సల్ఫ్యూరిక్ ఆసిడ్, నైట్రిక్ ఆసిడ్, సల్ఫర్ పౌడర్), కప్పర్ షీట్స్, స్టీల్ పైప్స్, సర్క్యూట్ బోర్డులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు సేకరించారు. దానిష్, బుకారో (ఝార్ఖండ్) నివాసి, ఇంగ్లి?ష్ పోస్ట్ గ్రాజుయేట్, 8 నెలలుగా రాంచీలో ఉంటూ 'గజ్వా లీడర్', 'సీఈఓ' అనే కోడ్ పేర్లతో మాడ్యూల్‌ను నడుపుతున్నాడు. అతను వాట్సాప్ గ్రూప్‌లలో తనను 'ప్రొఫెసర్'గా పరిచయం చేసుకుని, యువకులను రాడికలైజ్ చేస్తూ, పాకిస్తాన్ హ్యాండ్లర్స్‌తో సంప్రదింపులు జరిపేవాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ ఖురేషీ, ఫండింగ్‌ను హ్యాండిల్ చేసేవాడు. మొత్తం ఐదుగురు అరెస్టులు: దానిష్, అఫ్తాబ్, సుఫియాన్, కమ్రాన్, తెలంగాణకు చెందిన మహ్మద్ యమాన్(బోధన్). వీళ్లంతా 26 ఏళ్లలోపు యువకులు. ఈ మాడ్యూల్ 'ప్రాజెక్ట్ ముస్తఫా' పేరుతో భారతదేశంలో ఖిలాఫత్ స్థాపించడానికి, బాంబు పేలుళ్లు, ఫిదాయీన్ దాడులు చేపట్టేందుకు సిద్ధమవుతుంది. ఐసిస్ ఆన్‌లైన్ రాడికలైజేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా యువకులను రిక్రూట్ చేస్తూ, ఢిల్లీలో ఆపరేషన్‌లు నిర్వహించేందుకు యత్నించారు.తెలంగాణలో ఈ మాడ్యూల్‌కు బోధన్ (నిజామాబాద్ జిల్లా) లింక్ బయటపడటం ఆశ్చర్యకరం. మహ్మద్ యమాన్(20 ఏళ్లు), అనీస్‌నగర్ నివాసి, ఢిల్లీ పోలీసులు రహస్యంగా బోధన్‌లో దాగి ఉండి అరెస్టు చేశారు. అతని వద్ద పిస్టల్ పట్టుకున్నారు. యమాన్ దానిష్‌తో వీడియో కాల్స్ ద్వారా సంప్రదింపులు జరిపేవాడని పోలీసులు తెలిపారు. బోధన్ వంటి చిన్న పట్టణంలో ఇలాంటి లింక్ బయటపడటం ఆందోళన కలిగిస్తోంది

. గతంలో తెలంగాణలో ఉగ్రవాద కార్యకలాపాలు హైదరాబాద్ పాత్‌బస్తీ కేంద్రంగా జరిగేవి. కానీ ఇప్పుడు బోధన్, నర్సాపూర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో లింకులు బయటపడుతున్నాయి. 2022లో బోధన్‌లోనే పాకిస్తాన్‌తో లింక్స్ ఉన్న 60 మందికి పాస్‌పోర్టులు ఇచ్చిన ర్యాకెట్ బయటపడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఒకరు పట్టుబడి, ప్రశ్నించగా మొత్తం చిరునామా బయటపడింది. అలాగే, బోధన్‌లో కరాటే ఇన్‌స్ట్రక్టర్ అబ్దుల్ ఖాదర్ (52 ఏళ్లు)ను 2022లో అరెస్టు చేశారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తరపున మతోన్మాదాన్ని పెంచి, 200 మంది యువకులకు కరాటే, కుంగ్‌ఫు, ఆయుధాల శిక్షణ ఇచ్చేవాడు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి కరాటే ఇన్‌స్ట్రక్టర్లు పట్టుబడ్డారు. ఈ సంఘటనలు చిన్న పట్టణాల్లో రాడికలైజేషన్, రిక్రూట్‌మెంట్ పెరుగుతున్నట్లు చూపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లోని జియాగూడ, మల్లెపల్లిలో ఐసిస్ లింక్స్‌తో ఉన్నవారు పట్టుబడ్డారు. రాయచూర్ (కర్ణాటక)లో ఇద్దరు ఇటీవల అరెస్టయ్యారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో లష్కర్?ఏ?తొయిబా సభ్యుడు పట్టుబడ్డాడు. ఈ అరెస్టులు స్థానికుల మధ్య దాగి ఉండి కార్యకలాపాలు చేస్తున్నారని సూచిస్తున్నాయి.గతంలో ఉగ్రవాదులు హైదరాబాద్ పాత్‌బస్తీ, ఢిల్లీ వంటి పెద్ద సెంటర్లలో దాగి ఉండేవారు. కానీ ఇప్పుడు బోధన్, నర్సాపూర్ వంటి చిన్న పట్టణాల్లో వ్యాప్తి చెందడం ఆందోళనకరం. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా యువకులను సులభంగా రిక్రూట్ చేయడం. దానిష్ వంటివారు 'ప్రొఫెసర్', 'సీఈఓ' రూపంలో ట్రైనింగ్ ఆఫీసర్‌లుగా పనిచేస్తూ, ఐసిస్ ఐడియాలజీని వ్యాప్తి చేస్తున్నారు. చిన్న పట్టణాల్లో స్థానికులతో కలిసి జీవించడం సులభం. బోధన్‌లో యమాన్ వంటివారు సాధారణ యువకులుగా కనిపించి, ఆయుధాలు, కెమికల్స్ సేకరిస్తున్నారు. పాకిస్తాన్ హ్యాండ్లర్స్ ద్వారా ఫండింగ్, ట్రైనింగ్. ?కతఇబ వంటి సంస్థలు మతోన్మాదాన్ని పెంచి, మార్షల్ ఆర్ట్స్ శిక్షణల ద్వారా యువకులను తయారు చేస్తున్నాయి. ఈ మాడ్యూల్స్ ఢిల్లీ వంటి పెద్ద నగరాల్లో దాడులు చేపట్టితే, దేశ భద్రతకు తీవ్ర ముప్పు. చిన్న పట్టణాల్లో వ్యాప్తి పోలీసులకు మానిటరింగ్‌లో కష్టం. యువకులు (20?26 ఏళ్లు) రిక్రూట్ అవ్వడం సమాజంలో మత సంక్షోభాలకు దారి తీస్తుంది.ఈ ట్రెండ్ దేశ భద్రతకు కొత్త సవాలుగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఇంటలిజెన్స్ షేరింగ్ పెంచి, ఉగ్రవాదాన్ని మూలాల వద్ద నివారించాలి. లేకపోతే, చిన్న పట్టణాలు కూడా పెద్ద ముప్పులకు దారి తీస్తాయి.

## నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్నారు. భారత ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్ర ఎన్నికలతో పాటు అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను షెడ్యూల్ చేస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. దీంతో నవంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందిగ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి గతంలో నిర్ణయించిన సెప్టెంబర్ 30 గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం వచ్చే వారం హైకోర్టును ఆశ్రయించడానికి ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద కూడా క్లారిటీ రావాల్సి ఉంది.ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి ఉన్నాయి. కోటా అంశంపై స్పష్టత వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం కష్టమే. సెప్టెంబర్ చివరి నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని జూన్‌లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే సెప్టెంబర్ నెల దాదాపు సగం వరకు వచ్చింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా మరింత సమయం కోరాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో జాప్యం అనివార్యమన్నట్టుగా చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ కోటాను అమలు చేయడానికి కాంగ్రెస్ దృఢంగా కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం ఎన్నికలను కొనసాగించదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్ ప్రారంభంలో భారత ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందనే అభిప్రాయం ఉంది.అక్టోబర్ 2న దసరా తర్వాత వెంటనే జూబ్లీహిల్స్‌లో తన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడానికి అన్ని వనరులను ఉపయోగించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. బీఆర్ఎస్ నుంచి కైవసం చేసుకున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలాగా విజయాన్ని పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించి బీఆర్ఎస్ నుంచి సీటును కైవసం చేసుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బలంగా ఎన్నికలకు వెళ్లొచ్చని హస్తం పార్టీ భావిస్తోంది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో ప్రభావం పడుతుందని ప్లాన్ వేస్తోంది.

## నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం (అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం) ప్రతి సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటుచేసింది. సూర్యుని నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత వికిరణాలును ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతోందని 1987లో మాంట్రియల్ ప్రొటోకాల్ (ఓజోన్ పొర క్షీణతపై జరిపిన పరిశోధన) సంస్థ తెలిపింది. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న పదార్థాల నియంత్రణకు గాను రూపొందించిన మాంట్రియల్ ప్రొటోకాల్‌పై ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 1987, సెప్టెంబర్ 16న సంతకాలు చేశాయి. ఆ తరువాత 1994, సెప్టెంబర్ 16న మరో సమావేశం జరిపి, ఓజోన్ క్షీణతను అరికట్టాలని నిర్ణయించారు. దాంతో ప్రతి సంవత్సం సెప్టెంబరు 16న అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం జరపాలని నిర్ణయించబడింది. పర్యావరణ మార్పులపై, ఓజోన్ పొర క్షీణతపై ప్రజలకు అవగాహన కల్పించడం.అన్ని దేశాల ప్రభుత్వాలు మాంత్రియల్ ప్రొటోకాల్‌ను మరింత సమర్థంగా అమలుచేసి 2050 సంవత్సరానికి ఓజోన్ పొరను 1980కు ముందున్నస్థాయికి తేవడం,అడవుల నరికివేతను పూర్తిగా నిలిపివేయడం,మొక్కలను పెంచడం,యంత్రాల నుంచి వినాశకర వాయువులను విడుదల చేస్తున్న పరిశ్రమలు రక్షణ చర్యలు చేపట్టడం ఇలాంటి కార్యక్రమాలు చేపడతారు.

## భాగ్యనగరంలో భారీ వర్షం

**రోడ్లన్నీ జలమయం.. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం**

**వీధుల్లో పోటెత్తిన వరదలు..ముగ్గురు యువకులు గల్లంతు**

హైదరాబాద్ సెప్టెంబర్ 15,: భాగ్యనగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలలో లోతట్టు ప్రాం తాలు, రహదారులు జలమయమయ్యాయి. వీధుల్లో వరదలు పోటెత్తాయి. ముగ్గురు యువకులు వరదల్లో గల్లంతయ్యారు. ఆసిఫ్ నగర్ ప్రాంతం హబీబ్ నగర్‌లో మామ, అల్లుడ్లు వరదలో కొట్టుకుపోయారు. ముషీరాబాద్ ప్రాంతం వినోద నగర్‌లో పిట్టగోడపై సన్నీ అనే యువకుడు కూర్చొని స్నేహితులతో మాట్లాడతున్నాడు. గోడ కూలిపోవడంతో సన్నీ నాలాలో పడి కొట్టుకుపోయాడు. స్థానికులు కాపాడడానికి ప్రయత్నించాడు. అప్పటికే వరద ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. వెంటనే



పోలీసులు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. జిహెచ్ఎంసి, హైడ్రా, పోలీసులు గల్లంతైన వారి గాలింపు చర్యలు చేపట్టారు.హైటెక్ సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏ ర్పడింది. గచ్చిబౌలి పరిధి వట్టినాగులపల్లిలో తీవ్ర విషాదకర ఘటన చో టు చేసుకుంది. భారీ వర్షానికి వ ట్టినాగులపల్లిలో ఓ ఇంటి గోడ కూలిం ది. ఇద్ద రు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మియాపూర్, కూకట్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, అమీర్‌పేట, హి మాయత్‌నగర్, రామ్‌నగర్, ముషీరాబాద్, ఎల్బీనగర్, తార్నాక, కాచిగూడ, అల్వాల్, మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, కాప్రా, ఉప్పల్, టోలీచౌకి, శేరిలింగంపల్లి, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. వర్షం నీటితో వాహ న చోదకుల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది.ర్ఆర్‌జిల్లా గడ్డి అన్నారంలో గరిష్టంగా 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ ముషీరాబాద్ ప్రాం తంలో 12 సెం.మీ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 10 సెం.మీ, అడిక్‌మెట్‌లో 9 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7 సెం.మీ, మల్కాజ్‌గిరిలో 6 సెం.మీ, ఉప్పల్‌లో 7 సెం.మీ, అల్వాల్‌లో 7 సెం.మీ, గండిపేట 7 సెం.మీ, బండ్లగూడలో 5 సెం.మీ, నాంపల్లిలో 5 సెం.మీ వర్షపాతం నమోదైంది.

## సంగీత ప్రపంచానికి మకుటం లేని మహారాణి ఎమ్మెస్ సుబ్బలక్ష్మి

**-భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కళాకారిణి**

**-నేడు ఆమె జయంతి**

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )సంగీత ప్రపంచానికి మకుటం లేని మహారాణి ఎమ్మెస్ సుబ్బలక్ష్మి.. ఎంఎస్ గా పేరుగాంచిన మదురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని , నటి. ఈమె1998లో భారతదేశ అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కళాకారిణి, ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి. తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో న్యాయవాది సుబ్రహ్మణ్య అయ్యర్, వీణావాద్య విద్యాంసురాలు షణ్ముఖవడివు అమ్మాళ్ కు 1916 సెప్టెంబర్ 16 న జన్మించింది. చిన్నప్పుడు ఆమెను ముద్దుగా కుంజమ్మ అని పిలిచేవారు. తల్లి ఆమె ఆది గురువు. పదేళ్ళ ప్రాయం నుంచే సంగీత ప్రస్థానం ప్రారంభమైంది. అయితే ఆమెలో భక్తితత్వానికి బీజం వేసింది మాత్రం ఆమె తండ్రి అయ్యర్. సుబ్బులక్ష్మి శుద్ధ సంప్రదాయ కుటుంబంలో జన్మించింది కనుక తన జీవితకాలమంతా ఆమె భారతీయ సంప్రదాయాన్ని, సంస్కారాన్ని అమితంగా ప్రేమించింది. సంగీత ప్రపంచానికి మకుటం లేని మహారాణిగా ఎన్నో అవార్డులను ఎంఎస్ సుబ్బులక్ష్మి సొంతం చేసుకున్నారు. టీటీడీ ఆస్థాన సంగీత విద్వాంసురాలిగా కూడా ఆమె సేవలందించారు. తెలుగు నేలపై ప్రముఖంగా వినిపించే వేంకటేశ్వర సుప్రభాతం పాడింది కూడా ఆమే.కర్ణాటక సంగీత విద్వాంసురాలు మదురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి సెప్టెంబరు 16, 1916న తమిళనాడులోని మదురైలో జన్మించారు. తల్లిదండ్రులు సుబ్రహ్మణ్య అయ్యర్, షణ్ముఖవడివేర్. ఆమె నానమ్మ అక్కమ్మాళ్ వయొలిన్ విద్వాంసురాలు.చాలా చిన్నవయసులోనే సుబ్బులక్ష్మి సంగీతంపై ఆసక్తి పెంచుకున్నారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద కర్ణాటక సంగీతాన్ని, పండిట్ నారాయణరావ్ వ్యాస్ శిక్షణలో హిందుస్థానీ సంగీతాన్ని సాధన చేశారు.తన అక్క, అన్నదమ్ములతో కలసి సంగీత సాధన చేసి, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద సంగీతంలో శిక్షణ పొంది తన ప్రతిభకు స్పష్టమైన రూపునిచ్చి, తదనంతర కాలంలో జాతి గర్వించతగ్గ అంతర్జాతీయ సంగీత సామ్రాజ్ఞిగా ఎదిగింది. 1926 లో 10 సంవత్సరాల వయసులో గుడిలో పాటలు పాడడంతో తన తొలి సంగీత ప్రదర్శన మొదలైంది.సుబ్బులక్ష్మిలోని ప్రతిభను గుర్తించిన తల్లి మధురై నుంచి చెన్నైకి మకాం మార్చటంతో ఆమె జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ఆమె 1933 లో మద్రాస్ సంగీత అకాడెమీలో తన మొట్ట మొదటి సంగీత కచేరీకి శ్రీకారం చుట్టింది. సంగీతపరంగా సుబ్బులక్ష్మి జీవితంలో ఇది ఒక మలుపైతే తన గురువు, మార్గదర్శి, ఆనంద వికటన్ పత్రిక సీనియర్ ఎగ్జిక్యూటివ్, స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది అయిన త్యాగరాజన్ సదాశివన్ తో 1940 లో ఆమె ప్రేమవివాహం అయింది. సదాశివన్ తొలిభార్య కుమార్తె రాదను పెంచుకున్నారు. సంస్కృత భాషలోని భావం దెబ్బతినకుండా అలవోకగా ఆలపించడం ఆమె సాధన ద్వారా సాధించుకున్న గొప్ప వరం. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి వంటి సంగీత దిగ్గజాలు రూపొందించిన గీతాలకు సుబ్బులక్ష్మి తన గాత్రం ద్వారా ప్రాణం పోశారు.

## నవంబర్ తర్వాత మెట్రో నిర్మాణం పనులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు ఊఓఖీ సిద్ధంగా ఉంది. నవంబర్ నాటికి అనుమతులు వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. అయితే నిర్మాణానికి కనీసం రెండున్నరేళ్లు పట్టే అవకాశం ఉంది.హైదరాబాద్ పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే టెండర్లను పిలిచేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు మిలిటెడ్ (ఊఓఖీ) సిద్ధమవుతోంది. మెట్రో అధికారులు నవంబర్ నాటికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కసరత్తును ఇప్పటికే పూర్తి చేశారు. పాతబస్తీ మెట్రో మార్గం హైదరాబాద్‌లో మెట్రో విస్తరణలో ఒక కీలక భాగంగా మారనుంది. కొత్తగా ప్రతిపాదించిన ఈ మెట్రో మార్గం ఇప్పటికే ఉన్న కారిడార్లకు పొడిగింపు కావడంతో కేంద్రం కొన్ని కీలక అంశాలపై వివరణ కోరిందిముఖ్యంగా తొలి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోతో టికెటింగ్, ఆదాయం, నిర్వహణ ఎలా పంచుకుంటారనే అంశంపై కేంద్రం ప్రశ్నలు లేవనెత్తింది. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమస్య కాదని అధికారులు తెలిపారు. ఇప్పుడున్న ఎల్అండ్‌టీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడమో, లేదా థర్డ్ పార్టీకి అప్పగించి ఆదాయాన్ని పంచుకోవడమో చేస్తామని వివరించారు. ఈ రెండు ఆప్షన్లలో రెండో దానికే ఎల్అండ్‌టీ మొగ్గు చూపుతోంది. ఒకవేళ స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి నిర్వహణ అప్పగించడానికి సిద్ధమని ఎల్అండ్‌టీ పేర్కొంది.ప్రస్తుత ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పాతబస్తీ మెట్రో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే అధికారుల అంచనా ప్రకారం ఈ పనుల పూర్తికి కనీసం రెండున్నరేళు పట్టే అవకాశం ఉంది. సమయం తక్కువగా ఉండటం, పనులకు అవసరమైన 'రైట్ ఆఫ్ వే' (నిర్మాణానికి మార్గం) సిద్ధంగా ఉండటంతో టెండర్ల జారీకి అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, నష్టాల కారణంగా ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ఎల్అండ్‌టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రద్దీకి తగ్గ కోచ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రం వివరణ కోరింది. దీనిపై సంస్థ త్వరలో కొత్త కోచ్‌లను కొనుగోలు చేస్తామని బదులిచ్చింది.రైలు సంస్థ కేంద్రం అడిగిన అన్ని వివరణలు ఇచ్చామని దీపావళి తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక శుభవార్త వినే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలు చాలా వరకు తగ్గుతాయి.

## చెంచుపల్లి గ్రామస్తులకు ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తా.

**- పేద ప్రజల అభ్యున్నతే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం..**

**- సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడి అందిస్తాం**

**- రూ.143 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**- 16 మందికి రేషన్ కార్డులు పంపిణి**

జయశంకర్ భూపాలపల్లి.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొత్తపల్లిగోరి మండలం చెంచుపల్లి గ్రామస్తులకు ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం కొత్తపల్లిగోరి మండలం చెంచుపల్లి గ్రామంలో ఐటీడీఏ నిధులు రూ.143.19 లక్షలతో చెంచుపల్లి నుండి ఆర్ అండ్ బీ రోడ్డు రేగొండ మండల కేంద్రం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే హాజరై, టెంకాయ కొట్టి అట్టి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన వేదికపై గ్రామానికి చెందిన మొత్తం 16 మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్దే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తానని అన్నారు. ప్రజల కోసం రూపొందించిన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు అవుతూ, అర్హులందరికీ న్యాయం జరిగేలా అధికారులతో సమన్వయం చేస్తానన్నారు. చెంచుపల్లి గ్రామం ప్రభుత్వ భూమిలో చెంచుపల్లి గ్రామ అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొత్త రేషన్ కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలను చెప్పులరిగేలా తిప్పించుకొని ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రచార ప్రభుత్వం ఏర్పడ్డాక పేదలకు రేషన్ కార్డులు ఇస్తుంటే, అది చూసి ఓర్చుకోలేక ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల, పేదల సంక్షేమం గుర్తుకు రానివారు, అధికారం కోల్పోయాక మహిళలు పేదల సంక్షేమం గురించి సన్నాయి నొక్కులు నొక్కుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా గత ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలు తిరిగే పరిస్థితి లేకుండేదని, కానీ, అత్యవసర పరిస్థితుల్లో ఫ్రీగా బస్సు ఎక్కి తిరిగే పరిస్థితి ప్రస్తుతం మహిళలకు ప్రజా ప్రభుత్వం కల్పించిందన్నారు. ఫ్రీ జర్నీ పథకమే కాకుండా, మహిళా సంఘాల ద్వారా బ్యాంకు లీకేజీ రుణాలు అందజేస్తూ, ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేయడమే కాకుండా, పెట్రోల్ బంకులకు ఓనర్లను కూడా చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రుణాలను వృధా చేయకుండా, మంచిగా సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి పథంలో స్వయం సహాయక సంఘాల నడుపు కోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కొత్తపల్లిగోరి, రేగొండ మండల ప్రజా ప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ పోటీల్లో పథకాలు సాధించిన మంథని విద్యార్థులు

మంథని సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ పోటీల్లో మంథని జపాన్ షిటోరియు సికో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం కరీంనగర్ లోని సాయి మహాలక్ష్మి గార్డెన్ లో నిర్వహించిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కరాటే శిక్షకులు కావేటిసమ్మయ్య ఆధ్వర్యంలో మంథని కి చెందిన జపాన్ సిటోరియం సికో కాయి కరాటే ఇంటర్నేషనల్ కరాటే విద్యార్థిని విద్యార్థులు కథ మరియు కుమ్మితే విభాగాలలో పాల్గొని బంగారు వెండి కాంస్య పథకాలు సాధించారు. బిలో 14 ఇయర్స్ మరియు సబ్ జూనియర్స్ క్యాండిట్ ఏజ్ గ్రూపులలో జడగాల మనస్వి, మారేడు కొండ రిషి, పోగుల శివశాకేత్, కే సహస్ర బంగారు పథకాలు సాధించారు.బొగ్గుల మనోజ్ఞ, బి సహస్ర వెండి పతకాలు సాధించగా ఎండి ఇక్రా, మారేడు కొండ నిహారిక, జడగల సహస్ర, ఎలగందుల నిషిత్ కాంస్య పథకాలు సాధించారు.

# తురకపాలెంలో యురేనియం అవశేషాలు గుర్తింపు

గుంటూరు, సెప్టెంబర్ 15, గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో వరుస మరణాలతో జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం దీనిపై ఫోకస్ చేసింది. చెన్నైలో చేసిన టెస్టుల్లో యురేనియం ఉన్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో రెండు నెలల్లో ముప్ఫయి మందికి పైగా మరణించడానికి గల కారణాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అయితే తురకపాలెంలో మరణాలకు ఒక ఆర్ఎంపీ ఇచ్చిన మందులు, ఇన్ ఫెక్షన్లు కారణమయి ఉండవచ్చని ఆ దిశగా విచారణ సాగింది. ఆ ఆర్ఎంపీని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్ ను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. అయితే తాజాగా తురకపాలెంలో మరణాలకు, అనారోగ్య సమస్యలకు యురేనియం అవశేషాలు కలిసిన నీరు తాగడం వల్లనేనంటూ మరో అధ్యయనంలో వెల్లడి కావడం విశేషం. గ్రామంలో అందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. వాటిని ల్యాబ్ కు పంపించారు. అంతేకాదు నీరు, మట్టి నమూనాలను కూడా సేకరించి పరీక్షల కోసం ల్యాబ్ కు పంపారు. అయితే నీటి నమూనాలు మాత్రం చెన్నై ల్యాబ్ కు పంపారు. ఈ ల్యాబ్ నుంచి రిజల్ట్ వచ్చినట్లు సమాచారం. అందులో తురకపాలెంలో ఉన్న నీటిలో యురేనియం అవశేషాలు వెల్లడయినట్లు తెలిసింది.తురకపాలెం గ్రామం చుట్టూ అనేక క్వారీలు ఉన్నందునఅక్కడ క్వారీ గుంతల్లో నీటిని ప్రజలు వినియోగిస్తున్నందున ఈ మరణాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలిసింది. స్ట్రాన్షియం అనే పదార్థంతో పాటు ఈకొలి బాక్టిరియా కూడా నీటిలో ఉన్నట్లు కనుగొన్నారని చెబుతున్నారు. అలాగే గ్రామంలో వివిధ ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపారు. కానీ ఒక్క చోట తప్ప మిగిలిన చోట్ల ఎక్కడా బాక్టీరియా ఆనవాళ్లు లేవని గుర్తించారు. అయితే చెన్నై నివేదికలో మాత్రం అందుకు విరుద్ధంగా ఫలితాలు రావడంతో అక్కడి తాగు నీటి వల్లనే ఈ మరణాలు, తీవ్రమైన అనారోగ్యానికి కారణాలుగా వైద్యులు భావిస్తున్నారు. యురేనియం శరీరంలోకి వెళితే చాలా వెళితే చాలా ప్రమాదమని, దీనిద్వారా తొలుత కిడ్నీలకు, తర్వాత చర్మ సంబంధితమైన వ్యాధులు తలెత్తడమే కాకుండా మెదడు, కాలేయం, ఊపిరితిత్తులు, ఎముకలను దెబ్బతినడం ఖాయమని, అవే మరణాలకు కారణం కావచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. పరిశోధన కోసం గ్రామంలోని త్రాగు నీరు, మట్టి, స్థానికుల రక్త నమూనాలను సేకరించి చెన్నై, ఎయిమ్స్, గుంటూరు జీజీహెచ్ ల్యాబ్‌లకు పంపించారు. రెండు నెలల వ్యవధిలో 30 మందికి పైగా చనిపోవడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. జ్వరాలు వస్తున్నాయని ఆస్పత్రికి తీసుకెళ్తే మళ్లీ ఇంటికి తిరిగొచ్చే వారు తక్కువ అని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్న జ్వరాలకే ప్రాణాలు పోతున్నాయని, దీని వెనుక ఏదో పెద్ద కారణం ఉందని తురకపాలెం వాసులు అధికారులకు తెలిపారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రాణాలు పోవడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు.జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలోని వైద్య నిపుణులు గుంటూరు శివారులోని తురకపాలెంను మంగళవారం (సెప్టెంబర్ 9న) సందర్శించారు. అసాధారణ మరణాలకు కారణాలపై ఎన్‌సీడీసీ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ హేమలత, నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందం గ్రామంలో సమీక్షించింది. గ్రామస్తులను అడిగి పరిస్థితి తెలుసుకుని, కొన్ని వివరాలు సేకరించారు. చెన్నైలో పరీక్షించిన నీటి నమూనాల ఫలితాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. అందులో తురకపాలెం పరిసరాల నీటిలో యురేనియం అవశేషాలు ఉన్నట్టు తేలింది. ఈ ప్రాంతంలో రాళ్ల క్వారీలు విస్తారంగా ఉండటం, వాటిలోనే స్థానికులు పని చేయడం, అలాగే ఆ క్వారీ గుంతలలోని నీటిని వినియోగించడమే ఈ సమస్యకు కారణమయ్యుండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అలాగే, నీటిలో స్ట్రాన్షియం అనే హానికర మూలకం మరియు ఈకొలి బ్యాక్టీరియా కూడా ఉన్నట్లు చెన్నై నివేదికలో తేలింది. అయితే, మొదటిసారిగా నిర్వహించిన పరీక్షల్లో మాత్రం బ్యాక్టీరియా కేవలం ఒకచోటే ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై చెన్నై నివేదిక ఫలితాలు కొంత భిన్నంగా వచ్చాయని అధికారులు తెలిపారు.యురేనియం మానవ శరీరానికి ఎంతో ప్రమాదకరం అని డాక్టర్లు చెబుతున్నారు. ఇది తాగునీరు లేదా ఆహార మార్గంలో శరీరంలోకి ప్రవేశిస్తే మొదటగా మూత్రపిండాలకు తీవ్ర నష్టం కలుగుతుంది. అనంతరం చర్మ సమస్యలు, కాలేయం, మెదడు, ఊపిరితిత్తులు, ఎముకలకు దెబ్బతీసి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరించారు. పూర్తి సమాచారం మాత్రం ఇంకా అందాల్సి ఉండటంతో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దీనిపైఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అప్పటి వరకూ వారికి రోజూ భోజనం, మంచినీరు అందించాలని నిర్ణయించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల సందడి షురూ

విజయవాడ, సెప్టెంబర్ 15, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం నాలుగు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ లోపే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేసి పదవీ విరమణ చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే అధికార పార్టీలో సన్నాహాలు ప్రారంభం అయ్యాయి కానీ.. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కదలిక లేదు. కేంద్ర బలగాల సాయంతోనే ఎన్నికలు నిర్వహిస్తేనే అన్నమాట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపిస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా తీసుకుంటుందో అర్థమవుతోంది. గత అనుభవాల దృష్ట్యా స్థానిక సంస్థల విషయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నో రకాల ట్విస్టులు కొనసాగాయి. చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు నిమ్మగడ్డ రమేష్ కుమార్. అదే సమయంలో కరోనా వచ్చింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తన ఆదేశాలు పాటించలేదని.. నిమ్మగడ్డ రమేష్ కుమార్ చంద్రబాబు మనిషి అంటూ తప్పించే ప్రయత్నం చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరకు కోర్టు ఆదేశాలతో నియమితులయ్యారు నిమ్మగడ్డ. ఆయన కమిషనర్ గా ఉండగానే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నీలం సాహ్ని ఉన్నారు. ఆమె జగన్ హయాంలో నియమితులయ్యారు. కానీ ఇప్పుడు ఆమె ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు పెడితే ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర వచ్చింది. ఇప్పటికే ఆమె నేతృత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికలు జరిగాయి. ఆమెపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రకరకాల ఒత్తిడిలు వెళ్లాయి.

కానీ ఆమె పెద్దగా చలించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ స్థాయిలో? ఎలా జరుగుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అర్థమయింది. అందుకే ఎన్నికలను బహిష్కరించేందుకు ఆ పార్టీ ఇప్పటినుంచే కారణాలను వెతుక్కుంటుందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడే ఆ పార్టీలో ఆశావహులు ముందుకు వచ్చే అవకాశం లేదు. కనీసం పార్టీ పిలుపు ఇస్తున్న కార్యక్రమాలకు సైతం పార్టీ శ్రేణులు హాజరవుతున్న దాఖలాలు లేవు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో వచ్చిన ఫలితం పార్టీ శ్రేణులకు తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు జాతీయస్థాయిలో అధికారంలో ఉన్నప్పుడే.. ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. అటువంటిది ఇప్పుడు ఈ రెండు జెడ్పిటిసి ఎన్నికల్లో ఓడిపోవడం అనేది ఆ పార్టీకి చాలా నష్టమే. పార్టీలో ఒక అపనమ్మకాన్ని, నైరశ్యాన్ని అలుముకునేలా చేసింది ఈ ఫలితం. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను బాయ్ కట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దానికి కారణాలు చెప్పుకునేందుకే.. కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. ఒక పద్ధతి ప్రకారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## అందుబాటులోకి నానో యూరియా

ఏలూరు, సెప్టెంబర్ 15, ఏపీలో యూరియా కొరత పొలిటికల్ హీట్ ఎక్కించింది. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చేసాం అంటూ ప్రకటన చేసింది. కానీ ప్రతిపక్షాలు మాత్రం ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూరియాను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. మరోవైపు నానో యూరియా సైతం అందుబాటులోకి వచ్చింది. బస్తాలను మోసుకెళ్లే పని లేకుండా అర లీటర్ నానో యూరియా వాడితే సరిపోతుంది. అంటే ద్రవ రూపంలో ఈ నానో యూరియా అందుబాటులోకి వచ్చింది. దీని వినియోగం కూడా చాలా సులువు అని చెబుతున్నారు అధికారులు. యూరియా కొరత ఉన్న నేపథ్యంలో ఈ నానో యూరియా వాడాలని అధికారులు సూచిస్తున్నారు. వరి, పత్తి వంటి పంటలపై ఈ నానో యూరియా పిచ్చికారి చేయవచ్చు. గత కొద్దిరోజులుగా అధికారులు అవగాహన పెంచడంతో ఈ నానో యూరియా వాడకం పెరిగిందిఅయితే ఇప్పటివరకు ఏపీలో పాత పద్ధతిలోనే ఎరువులను వాడుతున్నారు. నానో యూరియాత అధిక ప్రయోజనాలు ఉన్న దాని జోలికి పోవడం లేదు. వ్యవసాయ శాఖ నిపుణులు, శాస్త్రవేత్తలు యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని సూచిస్తున్నారు. సాధారణ యూరియా బస్తాలో ఉండే పోషకాలు.. అర లీటరు నానో యూరియాలో ఉంటాయని చెబుతున్నారు.

## ఆదిమూలానికి ఏమైంది...

ఒంగోలు, సెప్టెంబర్ 15, వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం యాక్టివ్ గా ఉండటం లేదు. ఆదిమూలపు సురేష్ వైసీపీ హయాంలోని ఐదేళ్లలో కొన్నాళ్లు విద్యాశాఖ మంత్రిగానూ, మరికొన్నాళ్ల పాటు మున్సిపల్ శాఖ మంత్రిగానూ ఉన్నారు. అయితే ఆయన ప్రభుత్వం మారిన తర్వాత తాను ప్రాతినిధ్యం వహించిన శాఖలకు సంబంధించిన విమర్శలు అధికార పార్టీ నుంచి వచ్చినప్పటికీ ఆయన స్పందిచడం లేదు. పైగా ప్రస్తుతం యర్రగొండపాలెంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేకు ఇబ్బందికరంగా మారారంటున్నారు. అక్కడ వైసీపీ ఎమ్మెల్యేపై తన అనుచరులతో సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేయిస్తున్నారన్న



విమర్శలు వినిపిస్తున్నాయి.ఆదిమూలపు సురేష్ 2009, 2014, 2019, 2024 లలో జరిగిన ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో పోటీ చేశారు. నాలుగు సార్లు పోటీ చేసి మూడు సార్లు విజయం సాధించారు.ఆదిమూలపు సురేష్ దక్షిణ మధ్య రైల్వేలో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేశారు. తర్వాత వీఆర్ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. 2009 లో కాంగ్రెస్ తరుపున యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయనకు యర్రగొండపాలెం అంటేనే ఎక్కువ మక్కువ. అక్కడే తన రాజకీయాలను కొనసాగించాలని గట్టిగా అనుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయనను యర్రగొండపాలెం నుంచి తప్పించి కొండపి నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అక్కడ ఓటమితో ఇక కొండపి నియోజకర్గం నుంచి క్యాడర్ కు కూడా దూరంగా ఉన్నారు. 2009లో యర్రగొండపాలెం నుంచి పోటీచేసిన ఆదిమూలపు సురేష్ తొలిసారి గెలిచారు. అయితే వైఎస్ మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన జగన్ తో కలసి ప్రయాణం చేయాలని నిర్ణయించారు. జగన్ 2014 ఎన్నికల్లో ఆదిమూలపు సురేష్ ను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అప్పుడు అధికారంలోకి రాలేదు. 2019 ఎన్నికలకు వచ్చేసరికి సంతనూతలపాడు నుంచి ఆదిమూలపు సురేష్ ను మళ్లీ యర్రగొండపాలెంకు జగన్ పంపించి అక్కడి నుంచి పోటీ చేయించారు. అక్కడి నుంచి విజయం సాధించారు. జగన్ తొలి కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. రెండున్నరేళ్ల తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆదిమూలపు సురేష్ ను జగన్ కేబినెట్ లో కొనసాగించారు. అయితే ఈసారి విద్యాశాఖ కాకుండా మున్సిపల్ శాఖకు మార్చారు. ఆదిమూలపు సురేష్ కారణంగానే తన సొంత బంధువును బాలినేనిని కూడా జగన్ పక్కన పెట్టారు.జగన్ సొంత జిల్లా అయిన కడపకు ఆయనను ఇన్‌ఛార్జి మంత్రిగానూ నియమించారు. అంత నమ్మకాన్ని జగన్ సురేష్ పై ఉంచారు. కానీ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తనను యర్రగొండపాలెం నుంచి కొండపి పంపించడంపై ఆయన కొంత ఇబ్బంది ఫీలవుతున్నారు. 2024 ఎన్నికల్లో యర్రగొండపాలెం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ వైసీపీ నుంచి గెలవడంతో అక్కడకు కూడా వెళ్లలేక హైదరాబాద్ కే ఆదిమూలపు సురేష్ పరిమితమయ్యారంటున్నారు. అయితే తనకు బలమైన అనుచరులు, క్యాడర్ ఉన్న యర్రగొండ పాలెంలో ఆదిమూలపు సురేష్ వేలు పెడుతుండటం, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వర్గాన్ని తయారు చేయడంతో పార్టీ నాయకత్వం కూడా సీరియస్ కావడంతో ఇక ఏపీ రాజకీయాలకు ఆదిమూలపు సురేష్ దూరంగా ఉన్నారని తెలిసింది. ఐదేళ్లు మంత్రి పదవి ఇచ్చినా జగన్ కు కష్టకాలంలో మాత్రం దూరంగా ఉండిపోయిన ఆదిమూలపు సురేష్ పై వైసీపీ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నారు.

## జగన్ తో కలిసేది ఎవరు

నెల్లూరు, సెప్టెంబర్ 15, రాజకీయం రాజకీయంగానే చేయాలి. రాజకీయ కోణంలోనే చూడాలి. ఎవరి అవసరం.. ఏ పార్టీ అవసరం ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే మిగతా రాజకీయ పార్టీలతో సఖ్యత గానే ఉండాలి. ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబును మెచ్చుకోవాల్సిందే. ఎందుకంటే ఆయన ప్రతి పార్టీతోను మంచి సంబంధాలే నడుపుతారు. ఏ పార్టీతో వైరం పెట్టుకోరు. ఆయన చరిత్ర తీసుకుంటే ఇట్టే అర్థం అవుతుంది. వైసిపి హయాంలో రాజకీయ సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా ఆయనకు వామపక్ష నేతల మద్దతు లభించింది. విధానపరమైన అంశాల్లో తప్పించి.. వామపక్ష నేతలతో ఎప్పుడూ సఖ్యత గానే మెలుగుతారు. ఈసారి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వామపక్ష నేతల అభిప్రాయాలను గౌరవిస్తున్నారు. వారి వినతులను పరిగణలోకి తీసుకుంటున్నారు. అయితే ఆ విషయంలో జగన్మోహన్ రెడ్డి మాత్రం కాస్త భిన్నం. తనకు ఎవరి అవసరం లేదని.. ప్రజా మద్దతు ఉందని ఇతర రాజకీయ పార్టీలను నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు అది ఆయనకే శాపంగా మారింది.జాతీయస్థాయిలో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఇండియా కూటమి అవతరించింది. జాతీయ పార్టీగా కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు చూస్తోంది. కానీ అది అధికారికంగా కాదు. అయితే ఇండియా కూటమిలో వామపక్షాలు కూడా కీలక భాగస్వాములు. అయితే ఏ రాష్ట్రంలోనైనా ప్రతిపక్షానికి వామపక్షాల బలం అవసరం. ప్రజా పోరాటాలు రాజకీయ పార్టీలు చేస్తే ప్రజలు ఒకలా కనెక్ట్ అవుతారు. అదే వామపక్షాలు, ప్రజా సంఘాలు చేస్తే ప్రజల్లోకి ఆ ఉద్యమ ఫలాలు బాగా వెళ్తాయి. అందుకే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు వామపక్షాలతో కలిసి పోరాటాలు చేశారు. ప్రజా పోరాటాల విషయంలో అందర్నీ కలుపుకొని వెళ్లేవారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ప్రజా పోరాటాలకు ఇతర రాజకీయ పార్టీలకు పిలుపునివ్వడం మాత్రం విశేషం.అయితే జగన్మోహన్ రెడ్డి పిలుపునకు వామపక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దగా రెస్పాన్స్ రావడం లేదు. ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసింది. ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో నిర్మిస్తామని సీఎం చంద్రబాబు క్యాబినెట్ భేటీలో వెల్లడించారు. అయితే అది పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రగా అభివర్ణించారు జగన్మోహన్ రెడ్డి. దీనిపై రాష్ట్రస్థాయిలో ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నారు. కానీ సహకరించేందుకు కాంగ్రెస్ పార్టీ కానీ.. వామపక్షాలు కానీ ముందుకు వచ్చే అవకాశం లేదు. గతంలో జగన్మోహన్ రెడ్డి అనుసరించిన వైఖరి ఒక కారణం కాగా.. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో వ్యవహరించిన తీరు మరో కారణంకూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో పోరాటం చేశారు. ఆ సమయంలో కొన్ని జాతీయ పార్టీల నేతలు వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రధానంగా ఇండియా కూటమిలోని ఉన్న కీలక పార్టీల నేతలు వెళ్లి మద్దతు ప్రకటించారు. అయితే ఆ సమయంలో వామపక్ష నేతలు కానీ.. కాంగ్రెస్ పార్టీకి కానీ కనీస సమాచారం లేదు. నాడు జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డికి మద్దతు తెలిపిన పార్టీలు ఇప్పుడు ఏపీలో లేవు.

## మళ్లీ దగ్గరవుతున్నా జవహర్



విజయవాడ, సెప్టెంబర్ 15, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, అందులో తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ మళ్లీ అధిష్టానానికి దగ్గరయ్యారు. ఆయన వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇప్పటి నుంచే తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లుంది. కేఎస్ జవహర్ కు 2024 లో జరిగిన ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. ఆయన 2014లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన జగన్ వచ్చిన వెంటనే ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడమే కాకుండా మంత్రి పదవి కూడా వరించింది. అయితే కొవ్వూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో పొసగక పోవడంతో ఆయన రాజకీయ జీవితంలో స్పీడ్ కు కొంత ఫుల్ స్టాప్ పడినట్లయిందన్నది వాస్తవం. కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె. జవహర్ ను అక్కడి నేతలు వ్యతిరేకించడంతో 2019 ఎన్నికలలో ఆయనను తిరువూరుకు చంద్రబాబు పంపించారు. అయితే అక్కడ ఆయన వైసీపీ అభ్యర్థి రక్షణ నిధి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే తిరువూరు మొన్నటి ఎన్నికల్లో కొలికపూడి శ్రీనివాసరావుకు కేటాయించారు. అమరావతి ఉద్యమంలో పాల్గొన్న కొలికపూడికి టిక్కెట్ ఇవ్వడంతో ఆయన అక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తిరువూరు లో కొలికపూడికి, అక్కడి పార్టీ నేతలకు, క్యాడర్ కు పడకపోవడం, అనేక వివాదాలు చోటు చేసుకుంటుండటంతో జవహర్ చూపు తిరిగి తిరువూరు పై పడిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జవహర్ తిరువూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొవ్వూరు కంటే ఆయనకు తిరువూరు పైనే ప్రస్తుతం దృష్టి ఉన్నట్లు కనపడుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో జవహర్ కు కీలకమైన పోస్టు లభించింది. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులయ్యారు. కొవ్వూరు నియోజకవర్గంలో బలమైన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలు తనను తిరిగి కొవ్వూరుకు రానివ్వరన్న నమ్మకంతో ఆయన తిరువూరునే ఎంచుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన సన్నిహితుల వద్ద కూడా తాను తిరువూరును ఎంచుకుంటానని చెబుతుననట్లు తెలిసింది. జవహర్ ను ఎన్నికల సమయంలో రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించారు. అయినా సరే కొవ్వూరు వద్దు.. తిరువూరు ముద్దు అంటున్నారట జవహర్. మరి చంద్రబాబు నాలుగేళ్ల తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది తెలియకపోయినా తన ప్రయత్నంలో లోపం లేకుండా చూసుకుంటున్నారట.

## పోరాటాలకు సిద్ధమౌతున్న వైసీపీ

విజయవాడ, సెప్టెంబర్ 15, ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త పోరాటాలకు సిద్ధం అవుతోంది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుపడుతూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి రెడీ అవుతోంది. ఈ విషయంలో ఇతర రాజకీయ పక్షాల సహకారం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు తమతో కలిసి రావాలని కోరారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడే పునాదుల స్థాయిలో ఉన్న భవనాలను చూపించి.. ఇదేనా మెడికల్ కాలేజీలు అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం నేతలు పెద్దగా మాట్లాడడం లేదు. ఒకరిద్దరు తప్పిస్తే గట్టిగా రిప్లై ఇవ్వలేకపోతున్నారు. దీనిపై విమర్శలు రావడంతో అధినేత జగన్మోహన్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి రోజా ఈ అంశంపై మాట్లాడడం విశేషం. కొద్దిరోజులుగా రోజా కనిపించడం లేదు. ఆమె అరెస్టు ఉంటుందని అంతటా ప్రచారం జరిగింది. వైసిపి హయాంలో ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో భారీ అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వ ఆరోపణ. దీనిపై విజిలెన్స్ విచారణ కూడా ప్రారంభం అయింది. పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ క్రమంలో అప్పటి మంత్రిగా వ్యవహరించిన రోజాతో పాటు శాప్ చైర్మన్గా ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి సైతం ఈ కుంభకోణంలో హస్తం ఉందని విజిలెన్స్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ లో ఖచ్చితంగా మాజీ మంత్రి రోజా అరెస్టు జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అప్పటినుంచి రోజా సైతం వ్యూహాత్మకంగా సైలెంట్ అయ్యారు. అయితే ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలో ఏకంగా హోంమంత్రి వంగలపూడి అనిత పై విరుచుకుపడ్డారు రోజా. తద్వారా తన అరెస్టు విషయంలో భయపడడం లేదని తెలుస్తోంది. తనను అరెస్టు చేస్తే సానుభూతి వర్కౌట్ అవుతుందని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే గట్టి వాయిస్ తోనే రోజా ఇప్పుడు ముందుకు వచ్చారు.జగన్మోహన్ రెడ్డిక్యాబినెట్లో మంత్రిగా వ్యవహరించారు రోజా. ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2024 డిసెంబర్లో ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. అయితే అప్పట్లో ఆ క్రీడా పోటీలపై అనేక రకాల విమర్శలు వచ్చాయి. వాలంటీర్లే ఎంపైర్లుగా మారగా.. వైసీపీ సానుభూతిపరులతో క్రీడా పోటీలు నిర్వహించి పెద్ద ఎత్తున నిధులను పక్కదారి పట్టించారన్న విమర్శ ఉంది. నాసిరకం క్రీడా పరికరాలను అందించి భారీగా నిధులు గోల్మాల్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. అయితే దీనిపై అన్ని జిల్లాల నుంచి విజిలెన్స్ విచారణ జరిగింది. మాజీ మంత్రి రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అరెస్టు చేస్తారని టాక్ నడిచింది. అయితే కొన్ని రోజులపాటు రోజా సైలెంట్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా మీడియా ముందుకు వచ్చి ఏకంగా వంగలపూడి అనితకు సవాల్ చేశారు. మెడికల్ కాలేజీలపై అనిత తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. తనతో వస్తే పాడేరు మెడికల్ కాలేజీని చూపిస్తానంటూ సవాల్ చేశారు. మొత్తానికి అయితే కూటమి కేసుల విషయంలో డోంట్ కేర్ అన్నట్టు రోజా వ్యవహార శైలి ఉంది. మరి కూటమి నుంచి ఎలాంటి రిప్లై ఉంటుందో చూడాలి.

# కోడిగుడ్డు ఇలా తింటే విషంతో సమానం!



ప్రతిరోజు గుడ్డు తినడం ఆరోగ్యానికి మంచిదని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి ప్రభుత్వాలు. కోడిగుడ్డులో మన శరీరానికి కావలసిన ప్రోటీన్, విటమిన్, ఖనిజాలు ఎన్నో ఉంటాయని, కోడిగుడ్డులో ఉండే పోషకాలు మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తాయని, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని చెబుతారు. కోడిగుడ్డులో విటమిన్ డి, విటమిన్ ఏ, విటమిన్ బి12, ప్రోటీన్లు, కొవ్వులు, ఖనిజాలు, కోలిన్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయని చెప్తారు. కోడి గుడ్లతో ఆరోగ్యం తక్కువ కేలరీలతో గుడ్డు మనకు ఎక్కువ శక్తిని అందిస్తుందని చెబుతారు.ప్రతిరోజు గుడ్డు తినడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని, కంటికి మేలు చేకూరుతుందని చెబుతారు. కండరాలు, నరాల ఆరోగ్యానికి కూడా కోడిగుడ్లు మంచి చేస్తాయని చెబుతారు. అటువంటి కోడిగుడ్డును కొందరు ఉడికించుకుని తింటే, కొందరు ఆమ్లెట్ గా వేసుకుని, స్క్రాంబుల్డ్ గా చేసుకుని తింటారు. గుడ్డు ఇలా తీసుకుంటే ఆరోగ్య నష్టాలు కొంతమంది ఉడికించని గుడ్లను తినడం ఆరోగ్యమని భావించి పచ్చి గుడ్లను ఇష్టారాజ్యంగా తింటూ ఉంటారు. ముఖ్యంగా ఫిట్నెస్ పట్ల శ్రద్ధ ఉన్నవారు పచ్చి గుడ్డుతో బలం వస్తుందని నమ్మి దానిని తీసుకుంటారు. అయితే ఇది మంచిది కాదని, దీనివల్ల నష్టాలు వస్తాయని, ఒక్కోసారి దీనివల్ల శరీరం విషపూరితమవుతుందని చెబుతున్నారు. గుడ్లలో ఈ బ్యాక్టీరియాతో ఫుడ్ పాయిజన్ ఛాన్స్ పచ్చి గుడ్లలో సాల్మొనెల్లా అనే ఒక బ్యాక్టీరియా ఉంటుంది. ఈ బ్యాక్టీరియా మన శరీరానికి హాని చేస్తుంది. శరీరంలో అలర్జీలకు కారణమవుతుంది. ఒక్కోసారి పచ్చి గుడ్లు ఫుడ్ పాయిజన్ అవ్వడానికి కూడా కారణమవుతాయి. గుడ్లలో ఉన్న బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థను బలహీనపరిచి ఆరోగ్య నష్టం చేస్తుంది. కడుపు సంబంధిత సమస్యలు ఉన్నవారు పచ్చి గుడ్లను తింటే అనవసరమైన ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే ఈ రోగాలు పక్కా. రాసుకోండి! గుడ్డు ఇలా తింటే మంచిది కాదు పచ్చి గుడ్లు తింటే శరీరానికి కావలసినంత ప్రోటీన్ లభించదు. ఈ గుడ్లను ఉడకబెట్టి లేదా వండి తినడం వల్ల శరీరానికి నష్టం జరగదు. ఉడక పెట్టకుండా పచ్చి గుడ్డు సొన తీసుకుంటే మాత్రం అపారమైన నష్టం జరిగే ప్రమాదం ఉంది. కనుక గుడ్లను పచ్చిగా తినడం మంచిది కాదనే విషయాన్ని గుర్తుంచుకొని బాగా ఉడికించుకుని, వండుకుని తింటే మంచిది.

# ఫోన్ చూస్తూ ఆ పని చేస్తున్నారా..? మీ కొంప కొల్లేరే



ఆరోగ్యవంతమైన జీవనం కోసం చాలా మంది వ్యాయామాలను ఆశ్రయిస్తారు. వీటిలో వాకింగ్ అన్నింటికంటే సులభమైన , ప్రభావవంతమైన వ్యాయామం. క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం వల్ల కండరాలు బలోపేతం అవ్వడమే కాకుండా, శరీరంలోని కేలరీలు మరియు కొలెస్ట్రాల్ కరిగి బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. అయితే, చాలామంది వాకింగ్ చేసే సమయంలో కొన్ని సాధారణ పొరపాట్లు చేస్తుంటారు. ఈ పొరపాట్లు వాకింగ్ వల్ల వచ్చే పూర్తి ప్రయోజనాలను తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాకింగ్ సమయంలో చేయకూడని పొరపాట్లు: వేగంలో హెచ్చుతగ్గులు: తక్కువ వేగంతో నడవడం వల్ల కేలరీలు బర్న్ కావు. అదే ఒక్కసారిగా వేగం పెంచినా గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. అందుకే, మొదటి ఐదు నిమిషాలు నెమ్మదిగా నడిచి, ఆ తర్వాత క్రమంగా వేగాన్ని పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. వారానికి ఒకసారి 5 నిమిషాలు వేగాన్ని పెంచుకుంటూ ఉండటం ఉత్తమం. ' ఫోన్ చూస్తూ నడవడం: వాకింగ్ చేసేటప్పుడు ఫోన్ చూడటం, మెసేజ్‌లు టైప్ చేయడం చాలా మందికి అలవాటు. దీనివల్ల దృష్టి వాకింగ్‌పై ఉండదు, అంతేకాకుండా వెన్ను, మెడ నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది. ఫోన్ పక్కన పెట్టి నడకపైనే దృష్టి పెట్టడం మంచిది. ఖాళీ కడుపు లేదా అతిగా తిన్న తర్వాత నడవడం: ఖాళీ కడుపుతో నడవడం వల్ల శక్తి తగ్గి త్వరగా అలసిపోతారు. అదే అతిగా తిన్న తర్వాత నడవడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. వాకింగ్‌కి ముందు ఏదైనా తేలికపాటి ఆహారం తీసుకోవడం శ్రేయస్కరం. . సంచలనంగా బి-ఫార్మసీ విద్యార్థిని మర్డర్ వాకింగ్ వల్ల కలిగే పూర్తి ప్రయోజనాలను పొంది, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. యువత రోజుకు 40-60 నిమిషాలు నడిస్తే, మెదడులో ఎండార్ఫిన్ హార్మోన్ విడుదలయ్యి ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. కాబట్టి, సరిగ్గా నడవండి, ఆరోగ్యంగా ఉండండి.

# విటమిన్? బి12 లోపం లక్షణాలు- జాగ్రత్తలు, నిర్లక్ష్యం చేస్తే డేంజర్..!!

మన శరీరంలో అనేక జీవక్రియలను సరిగ్గా నిర్వహించడంలో విటమిన్ బి12 ముఖ్య పాత్ర పోషిస్తుంది. నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పర్చటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. డీఎన్ఏ సంశ్లేషణకు సహాయం చేస్తుంది. విటమిన్ బి12 లోపం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. కొందరిలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరిలో స్వల్ప లేదా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. బీ12 లోపం సరి చేసుకొనే విషయం లో నిర్లక్ష్యం చేస్తే ప్రాణం మీదకు తెచ్చుకోవటమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విటమిన్ బీ12 శరీరంలో జీవక్రియల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుంది. మాంసాహారాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించదు. శాకాహారుల్లో, కనీసం కోడిగుడ్లు తినని వారు లేదా పాలు తాగని వారు, పెరుగు, నెయ్యి వంటివి కూడా తినని వారిలో ఈ విటమిన్ లోపం ఏర్పడుతుంది. కొందరు




మాంసాహారం తింటున్నా ఇతర పోషకాహారాలను తినకపోవడం వల్ల కూడా విటమిన్ బి12 లోపం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. జీర్ణాశయ, పేగుల సమస్యలు ఉన్నా, శస్త్ర చికిత్సలు జరిగిన వారిలో, డయాబెటిస్ లేదా గ్యాస్ ట్రబుల్ మందులను వాడేవారిలో విటమిన్ బి12 లోపం వస్తుంది. బీ12 లోపం ఉంటే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపిస్తాయి. కొందరు డిప్రెషన్ బారిన పడతారు. చిరాగ్గా అనిపిస్తుంది. మరిన్ని కనుగొనండి వార్తల వెబ్‌సైట్ తెలుగు సినిమా డివీడీలు తెలుగు పుస్తకాలు తెలుగు వంటల దుకాణం ఇక రోజుకు ఎవరికి ఎంత మోతాదులో విటమిన్ బి12 అవసరం అవుతుందనే విషయానికి వస్తే 19 ఏళ్లకు పైబడిన వారికి రోజుకు 2.4 మైక్రోగ్రాముల మేర విటమిన్ బి12 అవసరం. విటమిన్ బి12 మనకు ఎక్కువగా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. మటన్ లివర్, కిడ్నీలు, చేపలు, రొయ్యలు, పాలు, చీజ్, పెరుగు, కోడిగుడ్లు, చికెన్ వంటి ఆహారాలను తరచూ తింటుంటే విటమిన్ బి12ను పొందవచ్చు. పలు శాకాహారాల్లోనూ మనకు విటమిన్ బి12 స్వల్ప మోతాదులో లభిస్తుంది. ఫోర్టిఫైడ్ సిరియల్స్, సోయా పాలు, బాదం పాలు, న్యూట్రిషనల్ ఈస్ట్, పుట్టగొడుగులు వంటి శాకాహారాలను తినడం వల్ల కూడా విటమిన్ బి12 లభిస్తుంది. కానీ వీటిల్లో స్వల్ప మోతాదులో మాత్రమే ఈ విటమిన్ ఉంటుంది. ఇలా విటమిన్ బి12 ఉన్న ఆహారాలను రోజూ తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.

# పానీపూరీ తిన్న వ్యక్తికి ప్రాణాంతక వ్యాధి.. కాళ్లు, చేతులు పచ్చగా.. నెల రోజులు ఆస్పత్రి బెడ్ పైనే..!



ప్రస్తుత బిజీ బిజీ లైఫ్ లో ప్రశాతంగా ఇంట్లో వంట చేసుకుని తినే భాగ్యం లేకపోయింది. ప్రస్తుత జీవనశైలి, ఉద్యోగాల టైమింగ్ దృష్ట్యా టైమ్ లేక చాలామంది బయటే తినేస్తున్నారు. ఈ క్రమంలో మహానగరంలోని ఫాస్ట్?ఫుడ్స్?, హోటల్స్, రెస్టారెంట్లు, చిరు బండ్ల వద్ద ఏ టైమ్ లో చూసినా రద్దీగానే ఉంటున్నాయి. అయితే ప్రస్తుతం కల్తీ ఆహారాలకు అడ్డాగా హైదరాబాద్ మారుతోంది. ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా లాభాల కోసం దందా నిర్వహిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ కు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి స్టోరీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్?తో పాటుగా ప్రధాన పట్టణాల్లో ఎక్కడ చూసినా ఫుడ్ ట్రక్ లు, తోపుడు బండ్లు, హోటల్స్, రెస్టారెంట్లు ఇమ్మడిముమ్మడిగా పెరిగిపోతున్నాయి. వాటిలో తినే ఆహారం రంగురంగులతో కనిపిస్తూ నోరూరిస్తున్న కారణంగా ప్రజలు వాటిని ఇష్టంగా తింటున్నారు. అయితే ఇటీవల హైదరాబాద్ కు చెందిన ఓ 22 ఏళ్ల సాఫ్ట్ వేర్ ఉద్యోగి పానీపూరీ తిని నెల రోజులు ఆస్పత్రిపాలయ్యాడు. నగరంలోని ప్రధాన ఆస్పత్రులలో ఒకటైన ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి డాక్టర్లు సకాలంలో చికిత్స చేసి అతడి ప్రాణాలు కాపాడారు. " ఈ ఘటనపై ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ.. ఓ యువకుడు తమ దగ్గరికి వచ్చాడని.. అతడి కళ్లు, చర్మం పసుపురంగులో మారిపోయింది. కామెర్లు వచ్చాయి. కడుపులో నొప్పి, వాంతులతోపాటు నీరసంగా ఉన్నాడు. మూత్రం ముదురు రంగులో ఉండటం కారణాలు చెప్పాడు. రక్తపరీక్షలు చేస్తే హెపటైటిస్ ఎ తీవ్రంగా ఉందని, దాంతో పాటే కాలేయంలోని ఎంజైమ్ లు పెరిగాయని, యాంటీ-హెచ్ ఏవీ ఐజీఎం యాంటీబాడీలు పాజిటివ్ గా ఉన్నాయని తేలిందని తెలిపారు. నాలుగు వారాలకు అతడి లివర్ మెరుగుపడి పూర్తిగా కోలుకున్నాడని వివరించారు. బయటి ఫుడ్ ఎంత ప్రమాదకరమైనదో ఈ ఘటన వివరిస్తుందని తెలిపారు.

# ఈ చిన్న చిట్కాలతో టేస్టీ, స్మూత్ చపాతీలు: చల్లారినా గట్టిపడవ్



చపాతీలు ఎవరికి ఇష్టం ఉండవు. అన్నానికి ప్రత్యామ్నాయంగా చాలామంది చపాతీలతో భోజనం లాగించేస్తుంటారు. చపాతీలు వేడివేడిగా ఉన్నంత వరకే అవి మృదువుగా ఉంటాయి. కొంచెం చల్లారినా గానీ అవి కొంత గట్టిపడుతుంటాయి. చల్లారిన తర్వాత వాటి రుచి మారిపోతుంటుంది. మరికొందరు చేసే చపాతీలు మాత్రం చల్లారిన తర్వాత కూడా మెత్తగానే ఉంటాయి. కొన్ని చిట్కాలను పాటిస్తే చపాతీలు మృదువుగా ఉంటాయి. మెత్తని చపాతీలు కావాలంటే పిండిని సరిగ్గా కలపడం చాలా ముఖ్యం. గోరువెచ్చని నీరు లేదా పాలను ఉపయోగించి పిండిని బాగా కలిపి, మృదువుగా అయ్యేలా నలిపి, కొద్దిసేపు అలాగే ఉంచాలి. ఆ తర్వాత వాటిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయాలి. అవసరమైతే తడి టవల్‌తో కప్పవచ్చు. చపాతీ మెత్తదనం అనేది మనం కలిపిన పిండిని బట్టి ఉంటుంది. తేమను నిలుపుకోవడం, సరైన పద్ధతిలో పిండిని కలపడంపై ఆధారపడి ఉంటుంది. పిండిని కలపడం, దాన్ని నిల్వ చేయడం వంటి పద్ధతులను పాటించడం ద్వారా చపాతీలు మృదువుగా వస్తాయి. పిండిలో కొద్దిగా గోరువెచ్చని పాలు కలపడం లేదా దాన్ని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయడం వంటి కొన్ని పద్ధతులను అనుసరించడం వల్ల చపాతీలు ఎక్కువ కాలం మృదువుగా ఉంటాయి. ప్రతీసారి మీరు మెత్తని చపాతీలనే ఆస్వాదించవచ్చు. పిండిని కలిపి అప్పటికప్పుడు చపాతీలను వేస్తే.. అవి గట్టిగానే తయారవుతాయి. కలిపిన పిండిని కొంత సమయం పాటు పక్కన పెట్టడం ఉత్తమం. దీనివల్ల అందులో ఉండే గ్లూటెన్ వదులు అవుతుంది. చపాతీలు మరింత సాగే గుణాన్ని పొందుతాయి. అటు ఒత్తడానికి కూడా సులభంగా మారుతాయి.

# పచ్చళ్ళు తెగ తింటున్నారా? అయితే ఈ రోగాలు పక్కా.. రాసుకోండి!


చాలామంది నిలువ పచ్చళ్లను ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే విపరీతంగా పచ్చళ్ళను తినడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పచ్చళ్ళు అధిక వినియోగం వల్ల ఆరోగ్య ప్రమాదాలు పెరుగుతాయని పోషకాహార నిపుణులు సైతం చెబుతున్నారు. రుచికరంగా ఉన్నాయని పచ్చళ్ళు పదేపదే తినేవారు ఆరోగ్యం విషయంలో అలర్ట్ అవ్వాల్సిందేనని, తమ అలవాట్లు మార్చుకోవలసినదేనిని హెచ్చరిస్తున్నారు. పచ్చళ్ళు ఎక్కువ తింటే అనారోగ్యాలు పచ్చళ్ళు వినియోగం కారణంగా మన శరీరంలో అధికస్థాయిలో సోడియం చేరుతుంది. ఇది మన శరీర ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. నిలువ పచ్చడిలో ఉండే అధిక సోడియం కారణంగా హైపర్ టెన్షన్ తో పాటు, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక పచ్చళ్లలో కాస్త నూనెను కూడా ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఇది మన ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి, బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. పచ్చళ్లలో ఉప్పు, కారం, మసాలాలతో సమస్యలు పచ్చళ్ళు ఎక్కువగా తినేవారిలో అందులో ఉప్పు ఎక్కువగా ఉండటం వలన కిడ్నీల పనితీరుపైన భారం పడుతుంది.



పచ్చళ్లలో ఉప్పు, కారం, మసాలాలు ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణ సంబంధిత మైన సమస్యలు వస్తాయి. కడుపు, పేగుపూతలు వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. అంతేకాదు పచ్చళ్ళు ఎక్కువ తినేవారిలో పోషకాహార లోపం ఏర్పడుతుంది. పచ్చళ్లలో వేసే పదార్థాలు శరీరానికి ఏమాత్రం పోషకాలను ఇవ్వవు. పైపెచ్చు ఇవి ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. నిల్వ పచ్చడికి ప్రత్యామ్నాయం ఇదే నిలవ పచ్చడిని తినడం బదులు అప్పటికప్పుడు నూరుకునే పచ్చళ్లను చేసుకుని తింటే మంచిది. వీటిలో సోడియం తక్కువ ఉంటుంది. ఇంట్లో మనం ఎప్పటికప్పుడు పచ్చడి తయారు చేసుకుని తినడం ఇష్టంగా తినే వారికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. పచ్చళ్ళ వాడకాన్ని తగ్గించి మితంగా తీసుకోవడం వల్ల మన శరీరానికి, ఆరోగ్యానికి హాని కలగకుండా చూసుకోవచ్చు. మన ఆహారంలో పచ్చళ్ళ కు బదులు ఇతర ఇష్టమైన ఆహార పదార్థాలు తినడం వల్ల కూడా పచ్చళ్ళ వల్ల కలిగే దుష్ప్రభావాలను అరికట్టవచ్చు.

విజయ సారథి






# అఖిల్ మళ్లీ అదే మిస్టేక్..!



ఒక సినిమా సెట్స్ మీద ఎక్కువ రోజులు ఉన్నా.. సెట్స్ మీద ఉన్నప్పుడే సినిమా గురించి నెగిటివిటీ స్ప్రెడ్ అయినా.. ఇంకా సినిమా షూటింగ్ పూర్తైన తర్వాత మళ్లీ రీ షూట్స్ చేస్తున్నా సాధారణంగా అలాంటి సినిమాపై ఆడియన్స్ ఇంట్రెస్ట్ పోతుంది. ఎంత మంచి కాంబినేషన్ అయినా కూడా ఆ సినిమాపై ఉన్న బజ్ అంతా కూడా ఈ వార్తల వల్ల పోతుంది. అందుకే మేకర్స్ సినిమాల లీక్స్ విషయంలో భయపడుతుంటారు. ప్రస్తుతం అలాంటి ఒక క్రేజీ సినిమా గురించి ఇలాంటి రకరకాల వార్తలు ఫ్యాన్స్ ని టెన్షన్ లో పడేస్తున్నాయి. ఇంతకీ ఆ సినిమా ఏంటి అంటే అదే అక్కినేని చినబాబు చేస్తున్న లెనిన్ మూవీ. సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా 80 శాతం షూటింగ్ అయిపోయిందని అన్నారు. లెనిన్ ఎప్పుడు మొదలు పెట్టారో తెలియదు కానీ టీజర్ వదిలి సర్ ప్రైజ్ చేశారు. అఖిల్ లెనిన్ టీజర్ ఇంప్రెస్ చేసిందే అనుకునేలోగా సినిమా నుంచి రకరకాల వార్తలు వచ్చాయి. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగానే హీరోయిన్ గా శ్రీలీల బయటకు వెళ్లి భాగ్య శ్రీ బోర్స్ ఎంటర్ అయ్యింది. ఈ మార్పు ఎందుకు అన్నది స్పష్టమైన కారణాలు తెలియవు. శ్రీలీల అటు బాలీవుడ్ లో బిజీ అవ్వడం వల్ల ఈ సినిమా వదులుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. కానీ అదే మెయిన్ రీజన్ అని మాత్రం తెలియదు. మరోపక్క ఆల్రెడీ శ్రీలీలతో తీసిన సీన్స్ అన్నీ కూడా భాగ్య శ్రీతో రీషూట్ చేస్తున్నారట. అఖిల్ కెరీర్ లో కమర్షియల్ సూపర్ హిట్.. సినిమా 80 శాతం అయ్యాక రీషూట్ అంటే బడ్జెట్ పెరిగిపోతుంది. ఈ లీక్స్ సినిమాపై ఏర్పడిన కాస్త కూస్తో ఇంపాక్ట్ ని పోగొట్టేలా చేస్తుంది. అఖిల్ లెనిన్ సినిమా అసలైతే డిసెంబర్ రిలీజ్ అనుకున్నారు. తీరా చూస్తే ఈ రీషూట్స్ వల్ల సినిమా నెక్స్ట్ ఇయర్ ఫిబ్రవరి, మార్చికి రిలీజ్ వాయిదా పడేలా ఉంది. ఆల్రెడీ అఖిల్ కెరీర్ లో ఒక్క కమర్షియల్ సూపర్ హిట్ లేదని ఫ్యాన్స్ ఫీల్ అవుతున్నారు. లెనిన్ సినిమా టీజర్ తో సర్ ప్రైజ్ చేసిన అఖిల్ ఈ మూవీతో హిట్ ట్రాక్ ఎక్కుతాడని అనుకోగా ఆ సినిమాకు సంబందించిన రీ షూట్స్ మళ్లీ కన్ ఫ్యూజన్ లో పడేస్తున్నాయి. మరి వారసుడు సినిమాల విషయంలో ఇలా ఎందుకు జరుగుతుందో నాగార్జున కాస్త సీరియస్ గా ఆలోచించాల్సిన పరిస్థితి ఉందనే చెప్పాలి. అఖిల్ లెనిన్ పూర్తైతే నెక్స్ట్ సినిమాను మాత్రం ఎర్లీగానే మొదలు పెట్టేలా ప్లానింగ్ లో ఉన్నారట. ఆల్రెడీ ఆ సినిమా స్టోరీ డిస్కషన్స్ నడుస్తున్నాయని తెలుస్తుంది.

# ట్రెండింగ్ లో మిరాయ్ రాముడు... ఈ డీటైల్స్ తెలుసా..?

సజ్జ మిరాయ్ సినిమా లాస్ట్ ఫ్రై డే రిలీజై మంచి టాక్ తో సూపర్ కలెక్షన్స్ తో దూసుకెళ్తుంది. కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. స్టోరీ, స్క్రీన్ ప్లే మాత్రమే కాదు సినిమాలోని విజువల్స్ గురించి కూడా ప్రత్యేకంగా మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా మిరాయ్ చివర్లో రెండు నిమిషాల పాటు వచ్చే రాముడి సన్నివేశాలు థియేటర్ లో విజిల్స్ పడేలా చేస్తున్నాయి. సోషల్ మీడియాలో మిరాయ్ లో రాముడు.. ప్రస్తుతం సోషల్ మీడియాలో మిరాయ్ లో రాముడిగా నటించింది ఎవరు.. అతని డీటైల్స్ ఏంటని తెగ వెతికేస్తున్నారు. ఫైనల్ గా అతని పూర్తి డీటైల్స్ బయటకు వచ్చాయి. మిరాయ్ సినిమా రిలీజ్ ముందు సినిమాలో రెండు సర్ ప్రైజ్ లు ఉన్నాయని తేజ సజ్జ సస్పెన్స్ లో పెట్టాడు. అదేంటా అని సినిమా చూసే సరికి రెబల్ స్టార్ ప్రభాస్ వాయిస్ ఓవర్ ఒకటి కాగా రెండోది పార్ట్ 2 లో విలన్ గా రానాకి లీడ్ ఇచ్చారు. ఐతే మిరాయ్ లో రాముడి సీన్స్ హైలెట్ అయ్యాయి. అది ఒక స్టార్ హీరో చేసి ఉంటే మరోలా ఉండేది కానీ రాముడిగా ఎవరు చేసినా నెక్స్ట్ లెవెల్ ఉంటుంది. మిరాయ్ లో కూడా అంతే.. ఐతే మిరాయ్ లో రాముడిగా నటించింది బాలీవుడ్ యాక్టర్ గౌరవ్ బోరా. ఉత్తరాఖండ్ లో డెహ్రాడూన్ అతనిది. ఐతే మాస్ కమ్యునికేషన్స్ పూర్తైన గౌరవ్ బోరా సినిమాల మీద ఇంట్రెస్ట్ తో ఢిల్లీ వెళ్లి అక్కడ థియేటర్ గ్రూప్ లో ఐదేళ్ల పాటు ఎక్స్ పీరియన్స్ సాధించాడు. ఆ నెక్స్ట్ హిందీలో నాటకాలు, షార్ట్ ఫిలింస్, వెబ్ సీరీస్ లు చేస్తూ వచ్చాడు. స్మాల్ స్క్రీన్ పై అతను ఛాన్స్.. అలా స్మాల్ స్క్రీన్



పై అతను ఛాన్స్ తెచ్చుకున్నాడు. అలా బుల్లితెర మీద చేస్తూ మోడల్ గా చాలా కమర్షియల్ యాడ్స్ కూడా చేస్తున్నాడు గౌరవ్ బోరా. ఐక్యూబ్, బజాజ్ ఫ్రీడం, టాటా క్యాపిటల్, సపోలా ఆయిల్ లాంటి ప్రకటనల్లో గౌరవ్ బోరా నటించారు. మిరాయ్ లో అతను కనిపించినంత సేపు మ్యాజిక్ చేశాడు. అవతార పురుషుడు రాముడి పాత్రలో ఆయన మెప్పించాడు. కచ్చితంగా మిరాయ్ తర్వాత కూడా తెలుగులో అతనికి మంచి రోల్స్ దక్కే ఛాన్స్ ఉంటుంది. తేజ సజ్జ మిరాయ్ లో విలన్ గా మంచు మనోజ్ నటించాడు. ఈ సినిమాలో మనోజ్ యాక్టింగ్ కూడా అదరగొట్టేసింది. కార్తీక్ టేకింగ్ తో పాటు మ్యూజిక్ కూడా ప్లస్ అవ్వడంతో మిరాయ్ ఆడియన్స్ ని థ్రిల్ చేస్తుంది.

# మిరాయ్ మూడు రోజుల బాక్సాఫీస్.. టోటల్ ఎంతంటే?

కంటెంట్ తో వచ్చిన సినిమాలకు జనాలు బ్రహ్మరథం పడతారని మరోసారి రుజువు చేసింది మిరాయ్ సినిమా. యువ హీరో తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ సినిమా విడుదలైన మూడు రోజుల్లోనే ఊహించని స్థాయిలో వసూళ్లు రాబట్టి రికార్డులు క్రియేట్ చేస్తోంది. సూపర్ హీరో సినిమాగా తెరకెక్కిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుంటూ అద్భుతమైన రెస్పాన్స్‌ను అందుకుంటోంది. రిలీజ్ అయిన తొలి రోజే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న మిరాయ్.. రెండో రోజు, మూడో రోజుకి వసూళ్లు పెంచుకుని వరుస విజయాలను సాధిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో హౌస్‌ఫుల్ షోలు కొనసాగుతుండగా,





ఓవర్సీస్‌లోనూ సినిమా అదే రేంజ్‌లో రాంపేజ్ చేస్తోంది. థియేటర్లలో ఫ్యామిలీస్, యూత్, కిడ్స్ అందరూ బాగా ఆస్వాదిస్తూ మౌత్ టాక్ తోనే సినిమాపై హైప్ పెంచుతున్నారు. ముంబయి వీధుల్లో పూనమ్ ముఖ్యంగా మూడో రోజుకి వరల్డ్ వైడ్‌గా సినిమా కలెక్ట్ చేసిన మొత్తం వసూళు రూ.81.2 కోట్ల గ్రాస్ దాటేయడం ఇండస్ట్రీని ఆశ్చర్యపరుస్తోంది. నార్త్ అమెరికాలో సినిమా ఇప్పటికే 1.6 మిలియన్ డాలర్ల మైలురాయిని అందుకుంది. ఇక హిందీ బెల్ట్‌లో మాత్రం రూ.10 కోట్ల పైగా వసూళ్లు సాధించడం సంచలనంగా మారింది. ఇప్పటి వరకు హిందీ బెల్ట్‌లో ఇంత స్థాయి వసూళ్లు సాధించిన వారు టాలీవుడ్‌లో టాప్ ఫోర్ స్టార్స్ మాత్రమే. అలాంటిది తేజ సజ్జా స్థాయిలో ఉన్న హీరోకి ఇది రికార్డ్ అని చెప్పొచ్చు. సూపర్ హీరో కాన్సెప్ట్‌కి టాలీవుడ్‌లో ఇంత అద్భుతమైన రెస్పాన్స్ రావడం కొత్త రికార్డులకి నాంది పలికింది. మిరాయ్ విజయం వెనుక ఉన్న బలమైన స్క్రీన్‌ప్లే, విజువల్స్, సూపర్ హీరో ఎమోషన్‌తోపాటు తేజ సజ్జా పెరుగుతున్న ఫ్యాన్ బేస్ ప్రధాన కారణమని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే దేశం నలుమూలలా, విదేశాల్లోనూ మిరాయ్ కి డిమాండ్ పెరుగుతూనే ఉంది. ఇక ఈ సినిమా లో విలన్‌గా మనోజ్ మంచు పోషించిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ మంచి ప్లస్ పాయింట్‌గా నిలుస్తోంది. ఆయన ఎనర్జీ, తేజ సజ్జా పెర్ఫార్మెన్స్‌కి సరైన కాంపిటీషన్ ఇస్తోంది. అలాగే డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని టెక్నికల్‌గా ఇచ్చిన విజువల్ ట్రీట్, యాక్షన్ సీక్వెన్స్‌లు అన్నీ కూడా వైరల్ అవుతున్నాయి. మొత్తం మీద మూడో రోజుకి మిరాయ్ వసూళ్లు ఇండస్ట్రీకి ఒక కొత్త దిశ చూపించాయి. తెలుగు సినిమా పరిధిని మించి, పాన్ ఇండియా లెవెల్లో తేజ సజ్జా పేరు బలంగా వినిపించేట్టు చేసింది. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎన్ని రికార్డులు బద్దలుకొడుతుందో చూడాలి.



# ది రాజాసాబ్.. ప్రభాస్ ఇంట్రడక్షన్ సాంగ్ కోసం రంగంలోకి ప్రముఖ రాపర్!

రెబల్ స్టార్ ప్రభాస్.. ప్రస్తుతం వరుస పెట్టి సినిమాలను ప్రకటిస్తూనే.. మరొకవైపు ఇతర హీరోల చిత్రాలలో కూడా గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అంతేకాదు పలు చిత్రాలకు మాట సహాయం కూడా చేస్తూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ప్రభాస్ చేతిలో సుమారుగా 6 ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో మొదటిది ‘ది రాజా సాబ్’. ప్రముఖ డైరెక్టర్ మారుతీ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5వ తేదీన ఈ సినిమా విడుదల చేస్తున్నామని మేకర్స్ ప్రకటించగా.. ఈ సినిమా నుండి విడుదలైన ట్రైలర్ అభిమానులలో పలు అనుమానాలు రేకెత్తించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ బాగోలేదని చాలామంది కామెంట్లు చేశారు. దీంతో కొన్ని సన్నివేశాలను ఇప్పుడు రీ షూట్ కూడా చేయాల్సి వస్తోంది. అందులో భాగంగానే సినిమాని కూడా వచ్చే ఏడాది జనవరి 9కి సంక్రాంతి సందర్భంగా వాయిదా వేయడం జరిగింది. ముంబయి వీధుల్లో పూనమ్ ఇక ప్రస్తుతం రీ షూట్ లో బిజీగా ఉన్న ప్రభాస్ మూవీకి సంబంధించిన ఒక వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇందులో ప్రభాస్ ఇంట్రడక్షన్ సాంగ్ కోసం మారుతి ఒక ర్యాపర్ సింగర్ ను రంగంలోకి దింపినట్లు సమాచారం. అసలు విషయంలోకి వెళ్తే.. డైరెక్టర్ మారుతి ఈ సినిమాలో వింటేజ్ లుక్ లో ప్రభాస్ ని చూపించబోతున్నానని ఇప్పటికే తెలిపిన విషయం తెలిసిందే అంతేకాదు ఈ సినిమా నుంచి విడుదల చేసిన పోస్టర్లు, టీజర్, గ్లింప్స్ ట్రైలర్ లో కూడా పాత ప్రభాస్ ని చూసి అభిమానులు తెగ సంతోషం వ్యక్తం చేశారు. అలాంటి ఈ సినిమాలో ప్రభాస్ ను మరింత హైలెట్ చేసేలా చూపించబోయే ఒక ఇంట్రడక్షన్ పాట కోసం కూడా దిగ్గజ రాపర్ ను రంగంలోకి దింపినట్లు సమాచారం. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ప్రముఖ రాపర్ సింగర్ హనుమాన్ కింద్ (సూరజ్ చెరుకట్) చేత ఈ పాట పాడించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడ లేదు కానీ త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పాటను ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా విషయానికి వస్తే.. వచ్చే ఏడాది జనవరి 9న బహుళ భాషల్లో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి తమన్ మ్యూజిక్ డైరెక్టర్గా బాధ్యతలు చేపట్టారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో సంజయ్ దత్ ప్రభాస్ కి దాత పాత్రలో కనిపించనున్నారు. ఇక ప్రభాస్ నటిస్తున్న తొలి హారర్ కామెడీ జానర్ మూవీ కావడంతో ఇప్పుడు ఈ సినిమాపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఈ సినిమా తర్వాత ప్రభాస్ హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ సినిమాను విడుదల చేయబోతున్నారు. వీటి తరువాత స్పిరిట్ మూవీతో పాటు కల్కి 2 , సలార్ 2 వంటి చిత్రాలను కూడా లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. ఈ చిత్రాల తర్వాత మరో యంగ్ డైరెక్టర్ కి ప్రభాస్ అవకాశం ఇచ్చినట్లు సమాచారం.




## మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలంటే లెక్కలు అవసరం ఏపీఎం లక్ష్మి




తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 15 పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న మహిళలకు మన డబ్బులు మన లెక్కల గురించి పూర్తి అవగాహన అవసరమని తాడేపల్లిగూడెం ఏపిఎం లక్ష్మి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటలో సర్పంచ్ ఆరుగొలను శ్రీనివాస్ అధ్యక్షతన మన డబ్బు, మన లెక్కలు, కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మన డబ్బులు మన లెక్కలపై సర్పంచ్ శ్రీనివాస్ తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సీసీలు, వివో ఏలు డ్వాక్రా మహిళలు హాజరయ్యారు.

## ఏపి సచివాలయంలో కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న చదలవాడ నాగరాణి



భీమవరం, సెప్టెంబర్ 15:(ఆంధ్రరేఖ ప్రతినిధి):సోమవారం ఏపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,తదితర కలెక్టర్లు

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 15 పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తీవ్రమైన అనారోగ్యానికి గురై ఆస్పత్రి వైద్య ఖర్చులకు ఇబ్బంది పడే పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరం వంటిదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం బి. కొండేపాడుగ్రామానికి చెందిన అరుగు సత్యవతి కి రూ.23,920 లు, కస్పా పెంటపాడు గ్రామానికి చెందిన వీరాబత్తుల వెంకట మహాలక్ష్మి కి రూ. 37,378 లు, తాడేపల్లిగూడెం మండలం చిన్న తాడేపల్లి గ్రామానికి చెందిన నందమూరి సాయి లక్ష్మి కి 1,62,000 లు సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆయన కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్య రేఖ దిగువకు ఉన్న కుటుంబాలు,తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఉండి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే కుటుంబాలకు మన ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని అన్నారు.కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క పేదవాడు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకూడదనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 25 లక్షల ఆరోగ్య భీమాను రూపొందించారన్నారు.

## పదేళ్ల స్మార్ట్ సిటీ ప్లాన్ అట్టర్ ప్లాప్ అయ్యింది!!..

### ప్రభుత్వం సమీక్షలు నిర్వహించి గ్రేటర్ సిటీ ప్రణాళిక వహించాలి

### దూసర్లపూడి రమణరాజు

కాకినాడ సెప్టెంబర్ 15 కాకినాడ నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం ముగిసి నేటికి మూడేళ్లు అయ్యిందని గత ప్రస్తుత ప్రభుత్వాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరగవలసిన స్పెషల్ ఆఫీసర్ నిర్వహణలో అఖిల పక్షం చేపట్టక పోవడం వలన తెగిన గాలిపటం చందంగా కార్పొరేషన్ పాలన పూర్తిగా పక్షవాతం దశకు వచ్చిందని కాకినాడ కార్పొరేషన్ పూర్వ పాలక మండలి సభ్యులు దూసర్ల పూడి రమణ రాజు పేర్కొన్నారు. కమిషనర్ సిటీ రూరల్ ఎమ్మెల్యేలు ఎంపీ రాజ్యసభ సభ్యుడు శాసనమండలి సభ్యుల మధ్య సమన్వయం లేకపోవడం వలన కార్పొరేషన్ పాలన పూర్తిగా అనారోగ్యానికి చేరిందన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి జిల్లాలో మున్సిపల్ మంత్రి జిల్లా ఇంచార్జ్ ఉన్నప్పటికీ శానిటేషన్ మురుగుపారుదల వీధిదీపాల నిర్వహణ వంటి అంశాల్లో ఎటువంటి మెరుగైన ప్రయోజనం లేదన్నారు.

# ఫిర్యాదుదారులతో మాట్లాడి నిర్ణీత గడువలోగా పరిష్కారం చూపాలి

### జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



భీమవరం: సెప్టెంబర్ 15: : సోమవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తో పాటు డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పిడి డాక్టర్.కెసిహెచ్ అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 219 ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినందున అధికారులు ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించి ఫిర్యాదుల నాణ్యమైన పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు.పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై సీఎంఓ నుండి అందిన ఫీడ్ బ్యాక్ నివేదిక అనుసరించి శాఖల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో డివిజనల్ స్థాయి అధికారులు పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఏ విధంగా పరిష్కరించారో జిల్లా స్థాయి అధికారులు పరిష్కార నాణ్యతను పర్యవేక్షించాలన్నారు. ఒక్కొక్క సందర్భంలో ఫిర్యాదులు పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులతో అధికారులు మాట్లాడాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల దరఖాస్తులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. పి జి ఆర్ ఎస్ సమావేశం మందిరం వెలుపల ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అర్జీదారుల దరఖాస్తులను పరిశీలించి, ఆధార్ నెంబర్ ద్వారా ఆన్లైన్ టోకెన్ జారీ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇ పి టి ఎస్ పోర్టల్లో ఫైల్స్ అప్లోడింగ్ పై అధికారులతో సమీక్షిస్తూ, తమ కార్యాలయాలలోని జీవోలు, ప్రొసీడింగ్స్, సర్కులర్లు, ఇతర డాక్యుమెంట్లు ఈపిటి ఎస్ పోర్టల్లో అప్లోడ్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు.సోమవారం పీజీఆర్ఎస్ కి అందని దరఖాస్తులలో కొన్ని ఈ విధంగా ఉన్నాయి.ఉండి మండలం, గోరింతోట గ్రామానికి చెందిన ముదిండి సారమ్మ తాను చిన్నతనం నుండి వికలాంగురాలునని, సొంత ఇల్లు కూడా లేదని, ప్రస్తుతం ఎన్టీఆర్ భరోసా వికలాంగ పెన్షన్ రూ.6 వేలు తీసుకుంటున్న అన్నారు. జీవనం కడు దుర్భరంగా ఉందని దయచేసి 15 వేల రూపాయలు పించం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.వీరవాసరం మండలం బాలేపల్లి గ్రామానికి చెందిన వీరవల్లి విజయ్ కుమారి తాను 16 సంవత్సరాల నుండి ఇదే గ్రామంలో నివసిస్తున్నానని ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఇంటి స్థలం మంజూరు కాలేదని, ఇంటి స్థలం మంజూరు చేయాలని అర్జీని సమర్పించారు.భీమవరం మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన కురెళ్ళ శేష వేణి అర్జీని సమర్పిస్తూ, తనకు 1.26 సెంట్లు భూమి మాత్రమే ఉందని,ఆన్లైన్లో 12 ఎకరాలుగా చూపుతున్నదని దయతో సరి చేయవలసిందిగా వినతి పత్రం సమర్పించారు.అత్తిలి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన శీలం సత్యనారాయణ తాను గత మూడు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నానని, వికలాంగ ధ్రువీకరణ పత్రం కూడా పొంది యున్నానని దయచేసి వికలాంగ పింఛను మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు.వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన మరిడి యజ్ఞ శ్రీనివాస్ అర్జీ సమర్పిస్తూ తనకు 27 సెంట్లు భూమి ఉందని, ఆన్లైన్లో 3 సెంట్లు మాత్రమే చూపిస్తున్నదని, దయచేసి తన పేరును 27 సెంట్లు భూమి నమోదు చేసి పాసుబుక్ ఇప్పించాలని కోరారు.పాలకోడేరు మండలం వెంద్ర గ్రామానికి చెందిన వీరవల్లి విజయలక్ష్మి అర్జీని సమర్పిస్తూ, నా కుమారుడు నన్ను మోసం చేసి నా ఇంటిని తన పేరు మీద మార్చుకుని తన్ను చూడటం లేదని,దయచేసి తన ఇంటిని తనకు ఇప్పించాలని కోరారు.వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ వినతి పత్రం సమర్పిస్తూ, విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ చట్టం 2016 పూర్తి స్థాయిలో అమలు చేయాలని, జీవో నంబర్ 43 ను రద్దుచేసి పాత సదరం సర్టిఫికెట్లు కొనసాగించాలని, విభిన్న ప్రతిభావంతులకు రెగ్యులర్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,స్వయం ఉపాధికి 50 శాతం సబ్సిడీతో బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించాలని, విభజిత జిల్లాలలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.సమావేశంలో డిపిఓ ఎం.రామనాథరెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ జి.గీతా బాయి, డీఎస్ఓ ఎం.సరోజ మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రారెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ ట్రిపునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెంకటరాయుడు 65వ జన్మదిన వేడుకలు..

భీమవరం సెప్టెంబర్ 15 వైయస్సార్సీపి భీమవరం నియోజకవర్గ కన్వీనర్ చినమిల్లి వెంకటరాయుడి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రాయలంలోని ఆయన ఇంటి వద్ద వెంకటరాయుడు జన్మదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు వందలాదిమంది తరలివచ్చారు. పలువురు శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు.



అనంతరం చిలిమిలి వెంకటరాయుడు మాట్లాడుతూ నేనెప్పుడూ జన్మదిన వేడుకలు జరుపుకోవడం తెలియదని ఏదో గుడికి వెళ్లి దండం పెట్టుకుని వచ్చేవాడినని ఈ రోజున నా గృహం నందు ఇంత ఘనంగా జరిగినందుకు సంతోషంగా ఉందని ఇదంతా ప్రజలకు వైయస్సార్ జగన్మోహన్ రెడ్డి మీద ఉన్న అభిమానమే ప్రజలందరూ నా పుట్టినరోజు వేడుకలు పాల్గొన్నారు అని అన్నారు ఈ ఉత్సాహం ఉరకలేస్తూ స్థానికులు ఏ ఎన్నికలు వచ్చినా అలాగే 2029 పార్లమెంట్ ఎన్నికలు వచ్చినా అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా మళ్ళీ జగన్ మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రి గా గెలిపించుకోవాలని ప్రజలందరూ చూస్తున్నారని అన్నారు ఎందుకంటే ఒక ఇంచార్జ్ పుట్టినరోజు అని సమాచారం తెలుసుకుని వాళ్లు వాలంటరీగా వచ్చి నాకు విషెస్ చెప్పడం అంటే అది జగన్మోహన్ రెడ్డి మీద ఉన్న అభిమానమే అని తెలియపరుస్తున్నాను ఇలా నా పుట్టినరోజు వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికి అలాగే పార్లమెంట్ సభ్యులు గానీ టౌన్ ప్రెసిడెంట్ అలాగే పార్టీ ఇన్చార్జిలు కార్యకర్తలు వాళ్ళందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని అన్నారు...

## దసరా మహోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి

### ప్రతిరోజూ బాల త్రిపురసుందరి దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు


భీమవరం సెప్టెంబర్ 15 భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి దేవస్థానంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవ బ్రోచర్, పుస్తకాలను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ వివరాలను మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ కు వివరించారు. బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, అమ్మవారికి 22న బాల త్రిపురసుందరీ దేవి, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణ దేవి, 25న కాత్యాయనీ దేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న లలితా దేవి, 28న చండీ దేవి, 29న సరస్వతి దేవి, 30న విజయ కనక దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్ధినిదేవి, 2న రాజ రాజేశ్వరి దేవి అలంకరణ చేస్తామని, 4న గ్రామోత్సవం, 6న అన్న సమారాధన నిర్వహిస్తామని తెలిపారు. అల్లు రామకృష్ణ, అల్లు వనజాక్షి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## అమెరికాను సురక్షితం చేయడమే లక్ష్యం

### నాగమల్లయ్య హత్యపై తీవ్రంగా స్పందించిన ట్రంప్

వాషింగ్టన్,సెప్టెంబర్15:అమెరికాను మళ్లీ సురక్షితం చేయడమే తమ లక్ష్యమని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని అన్నారు. అక్రమ వలసలను ఇక ఎంతమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. డాలస్‌లో భారతీయుడు చంద్ర నాగమల్లయ్యను క్యూబా వలసదారుడు హత్య చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై ఫస్ట్ డిగ్రీ కింద అభియోగాలు నమోదు చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. 'ఇకపై అక్రమ వలసదారులపై మెతకవైఖరి అవలంబించబోమని స్పష్టం చేశారు. 'చంద్ర నాగమల్లయ్య హత్య కేసులో సంచలన విషయాలు నా దృష్టికి వచ్చాయి. డాలస్‌లో మల్లయ్యకు మంచి పేరుంది. అలాంటి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తన భార్య, కుమారుడు చూస్తుండగానే ఈ ఘోరం జరిగింది. మా దేశానికి సంబంధం లేని, క్యూబాకు చెందిన అక్రమ వలసదారుడు ఈ దురాగతానికి పాల్పడ్డాడు'



## అలనాటి స్నేహానికి ఆధ్యాత్మిక అర్థం

### మావుళ్ళమ్మ-పెద్దింట్లమ్మ దర్శన యాత్రలో 86-87 బ్యాచ్



పెనుగొండ:సెప్టెంబర్ 15 పెనుగొండ మండలం సిద్ధాంతం జడ్పీ హైస్కూల్ 1986-87 పదవ తరగతి పూర్వ విద్యార్థులు భీమవరం మావుళ్ళమ్మ, కొల్లేరు పెద్దింట్లమ్మ ఆలయాలను కుటుంబాలతో కలిసి దర్శించి, స్నేహాన్ని, సేవా భావనను సమాజానికి చాటిచెప్పారు.స్నేహం అంటే కేవలం జ్ఞాపకాలే కాదు.ఆపదలో అండగా నిలిచే బంధం. 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, చిలువూరి గంగాధర్ రాజు (శివ) ఆధ్వర్యంలో, భీమవరం మావుళ్ళమ్మ మరియు కొల్లేరు పెద్దింట్లమ్మ ఆలయాలను సందర్శించి, తమ కుటుంబాలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాత్రలో 150 మందికి పైగా పాల్గొని, సామూహిక భోజనాలు, తీపి జ్ఞాపకాలు, మరియు సేవా సంకల్పాలను పునరుద్ఘాటించారు.2018లో మొదటి గెట్ టుగెదర్ తర్వాత, ప్రతి సంవత్సరం విహారయాత్రలు నిర్వహిస్తూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులను ఆదుకుంటున్నారు.ఈసారి యాత్రలో గ్రూప్ లేడీ కోఆర్డినేటర్ కొముజు శశిదేవి, చేకూరి రవికుమార్ రాజు, కోసూరి రంగరాజు, పెనుమత్స నరసింహరాజు, సయ్యపురాజు చంద్రమౌళీశ్వరరాజు, పోలిక భీమరాజు, మానుపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## 8ఏళ్ల బాలికపై అత్యాచారం కేసు

### దోషికి 21 ఏళ్ల జైలు..30వేల జరిమాన

నల్గొండ,సెప్టెంబరు15 ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. దోషి దోమల రాముకు 21 ఏళ్లు జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధించింది. ఈ ఘటనపై 2018 ఫిబ్రవరిలో చిట్యాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. 2022 నుంచి నల్గొండ పోక్సో కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు. బాధిత కుటు-ంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

### రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మేరీ ఇమ్మాక్యులేట్ విద్యార్థులకు 13 మందికి మెడల్స్

### టి.నర్సాపురం మండలానికి చెందిన గుర్రం హనీకి గోల్డ్ మెడల్.

.ఏలూరు జిల్లా సెప్టెంబర్ 13ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం చింతలపూడి మండలంలోని మేరీ ఇమ్మాక్యులేట్ హై స్కూల్లో చదువుతున్న విద్యార్థులు 13 మంది విద్యార్థినిలకు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ మొత్తంలో 2 గోల్డ్ మెడల్స్ 7 సిల్వర్ మెడల్స్ మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించడం జరిగింది ఈ స్కూల్లో సంబంధించి జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో టీ నర్సాపురం మండలానికి చెందిన ఇద్దరు బాలికలు ఉండడం గమనార్హం వారిద్దరికీ ఒకరికి గోల్డ్ మెడల్ మరొకరికి సిల్వర్ మెడల్ రావడం జరిగింది అదేవిధంగా గోల్డ్ మెడల్ వచ్చిన విద్యార్థిని గుర్రం హని గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆమె తండ్రి గుర్రం నాగరాజు సోమవారం. తెలిపారు.

## ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే నారా చంద్రబాబు నాయుడు యొక్క లక్ష్యం



నరసన్నపేట(విజయసారథి): స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎంఈ ర్యాంపు ప్రోగ్రాం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో మిషనరీ అనుభవజ్ఞులైనటువంటి ముఖ్యమంత్రి నరసన్నపేటలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ప్రతి కుటుంబంలో తయారు చేయడమే లక్ష్యంగా శాసనసభ్యులు సోమవారం తమ కళాశాలకు ఈ యొక్క కార్యక్రమాన్ని ఇక్కడ నుండి ప్రారంభిస్తున్నందుకు సంతోషిస్తున్నామని తెలియజేశారు. యువత వారి ఆలోచన విధానాన్ని మార్చుకొని ప్రతి కళాశాల నుండి ప్రతి గ్రామములో నుండి ఈ పారిశ్రామికవేత్తలుగా పరిశ్రమలను కంపెనీలను వ్యాపారములను స్థాపించడానికి నైపుణ్యతను పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరు కూడా ఈ సద్వినియోగపరుచుకోవాలని కోరారు అరుణ్ కుమార్ మాట్లాడుతూ త్రెడ్స్ ఐటీ ప్రతినిధి జిల్లా ఇన్చార్జి మాట్లాడుతూ శాసనసభ్యులు వారి చేతుల మీదుగా ఈ కార్యక్రమము ఈ జిల్లాలో ప్రప్రథమంగా నరసన్నపేట నియోజకవర్గంలో ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమని తెలియజేశారు యువత ప్రతి ఒక్కరూ మహిళలు ప్రతి ఒక్కరు కూడా ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నారా లోకేష్ బాబు యువ నాయకులు ఈరోజు రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ శాశ్వతమైనటువంటి జీవన భృతిలను కల్పించే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరల్డ్ బ్యాంకు సహకారంతో త్రెడ్స్ ఐటీ నిర్వహణలో ఈ యొక్క స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాము పద్మావతి డిగ్రీ కళాశాలలో నిర్వహించడం తద్వారా ప్రతి ఒక్క యువత ఒకప్పుడు 18 00 రూపాయలు జీతంతో ఒక చిన్న జూటు పరిశ్రమలో ఉద్యోగిగా చేరినటువంటి జిఎంఆర్ వారి తల్లి పేరు మీద వరలక్ష్మి జూట్ పరిశ్రమను నెలకొల్పి ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచారని ఉదాహరణగా యువతను ప్రోత్సహించేందుకు తెలియజేశారు అనంతరం శిక్షణ పొందుకుంటున్నటువంటి మెటీరియల్ లను అందజేశారు శాసనసభ్యులను సత్కారము త్రెడ్స్ ఐటి ప్రతినిధి అరుణ్ కుమార్ కళాశాల యాజమాన్యం వారు గౌరవించారు ఎం శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ మీ అప్పలనాయుడు రిటైర్డ్ టీచర్ కంబకాయ కే రామారావు టిడిపి టౌన్ పార్టీ ప్రెసిడెంట్ వాగోటి రామచంద్రరావు మేనేజ్మెంట్ నెంబర్ నెంబర్ నెంబర్ నెంబర్ కే ఏ రాజు పవన్ గౌతమ్ టీమ్ మెంబర్స్ ఆయా గ్రామాల నుండి వచ్చినటువంటి విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### వైద్యాధికారి



మంత్రాలయం(విజయసారథి):ప్రజలు వర్షాకాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రాలయం మండలం కల్లుదేవకుంట ప్రభుత్వ వైద్యాధికారి వసంత సూచించారు. ఈ సీజన్లో వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచి, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, రాత్రిళ్లు దోమతెరలు వాడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంత్రాలయం(విజయసారథి):మంత్రాలయం మండలం రచ్చుమర్రి ఆదర్శ పాఠశాల(కళాశాల) విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అశోక్ నాయక్ తెలిపారు. తిరుపతిలో నిన్న జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెంలో ప్రతిభ చూపారన్నారు. భాస్కర్, వీరేష్, దినేష్, శ్రీనివాసులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను టీచర్లు అభినందించారు.




## ఘనంగాపెద్దాపురం ఆర్ అండ్ బి కార్యాలయంలో ఇంజనీర్స్ డే

కాకినాడ(విజయసారథి):కాకినాడ జిల్లా పెద్దాపురం ఆర్ అండ్ బి కార్యాలయం లో ఇంజనీర్స్ డే పురస్కరించుకొని సెప్టెంబర్ 15 తేదీని భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా పెద్దాపురం డివిజన్ ఆర్ అండ్ బి కార్యాలయంలోఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా ఆర్ అండ్ బి ఎస్ఈ జి. కాంతముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికిపెద్దాపురం ఆర్ అండ్ బి ఇంచార్జ్ఈఈ కె.ఎస్. రాఘవరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి జిల్లాలోనిపలువురు ఆర్ అండ్ బి, డి ఇ లు, ఏఈ లు జ్యోతి ప్రజ్వలనచేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఇన్చార్జి ఈ ఈ రాఘవరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివని ఆయనశాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేషంగా కృషి చేశారని అందుకే ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క ఇంజనీరు ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం కాకినాడ జిల్లాలోని (ఆర్ అండ్ బి) డి ఈలు, ఏఈలుఇతరఅధికారులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు స్మరించుకుంటూ అయిన వలె ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ సందర్భంగా పలువురు ఇంజనీరింగ్ అధికారులనుశాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం, అమలాపురం ఈఈలు నరసయ్య, రాఘవరావు ,డి. రాము, తుని, కాకినాడడిఇలు అంబటి సూర్యప్రకాశరావు, శ్రీనివాస్, పెద్దాపురం,జగ్గంపేట, పిఠాపురంఏఈలు సత్య సాయి ప్రసాద్, సాయికిరణ్, లోవరాజు, ఇతర ఏఈలు టెక్నికల్ సిబ్బంది, కార్యాల సిబ్బంది, పలువురు కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.




## పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్

నంద్యాల(విజయసారథి):ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను అధికారులు నాణ్యతతో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, డి ఆర్ డి ఎ పి డి, తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను అధికారులు నాణ్యతతో ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై తహసిల్దారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్లైన్లో నమో చేసి అర్జీ దారునికి రసీదు ఇచ్చి సమస్య పరిష్కరించాలన్నారు. ఇలా చేయడం వల్ల ప్రతి అర్జీదారునికి తప్పక న్యాయం జరుగుతుందన్నారు.పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు1. బనగానపల్లె మండలం, పసుపుల గ్రామానికి చెందిన పి. మద్దిలేటి నాయక్, సర్వే నెంబర్ 61/1లో 67 సెంట్లు భూమి తన పేరు మీద ఉందని ఈ భూమిని ఆన్లైన్ చేయాలని డిఆర్ఓ కు అర్జీ సమర్పించారు. 2. నంద్యాల మండలం, కానాల గ్రామానికి చెందిన ఎస్. చిన్న గుండయ్య సర్వే నెంబర్ 564 లో 1.56 ఎకరాల భూమి మా పూర్వీకుల నుంచి మా అనుభవంలో ఉంది ఈ భూమిని నా పేరుమీద ఆన్లైన్ చేయాలని డిఆర్ఓకు అర్జీ సమర్పించారు. 3. జూపాడు బంగ్లా మండలం, జూటూరు గ్రామానికి చెందిన ఎం. స్వర్ణలత సర్వే నెంబర్ 215/ఏ, లో రెండు ఎకరాల భూమి నా పేరు మీద ఉంది ఈ భూమికి రాస్తా చూపించాలని డిఆర్ఓ కు అర్జీ సమర్పించారు.ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అర్జీలు సమర్పించారు. సదురు సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డిఆర్ఓ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ లీలావతి, డీఈఓ జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యూరియాను రైతులకు షరతులు లేకుండా పంపిణీ చేయాలి

### కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి

కర్నూలు(విజయసారథి):జిల్లా రైతులకు యూరియాను షరతులు లేకుండా పంపిణీ చేయాలని కర్నూలు జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ఏ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గల మహాత్మా గాంధీ గారి విగ్రహం ముందు రైతు సమస్యలపై సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు కామన ప్రభాకర్ రావు సూచన మేరకు ఈరోజు కర్నూలు కలెక్టర్ కార్యాలయం వద్ద యూరియా కొరత కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందనీ జాయింట్ కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. యూరియా బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న విషయం మరియు కొరతతో అల్లాడుతున్న రైతుల ఆవేదన గురించి రాష్ట్రంలో యూరియా కొరతవల్ల రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా పంట నష్టపోయి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు సంభవించే వాతావరణానికి అద్దం పడుతున్న కూటమి ప్రభుత్వాల అసమర్థత పాలనకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ పార్టీ నిరసన ద్వారా రైతుల ఆవేదనను ప్రభుత్వానికి ఈ ధర్నా నిరసన కార్యక్రమం ద్వారా హెచ్చరిస్తున్నామని షరతులు లేకుండా యూరియా విక్రయిస్తే కౌలు రైతులకు కూడా ఉపయోగపడుతుందని సూర్య ప్రకాశ్ రెడ్డి తెలియజేశారు. అనంతరం కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాషా మాట్లాడుతూ టమోటా, ఉల్లి, వరి మొదలగు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఈ నిరసనలు గ్రామస్థాయి నుండి ఢిల్లీ వరకు తీసుకువెళతామని కాంగ్రెస్ పార్టీ తరఫున హెచ్చరిస్తున్నామని 300 ఖరీదు చేసే యూరియా బస్తాను అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న దళారులను అరికట్టాలని రైతుల పక్షాన జాతీయ కాంగ్రెస్ పార్టీ కోరుతుంది. రైతుల ఆవేదన ఆందోళన చెంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు సంభవించకుండా తక్షణం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందనీ తెలియజేశారు . ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాక్రిష్ణ, పత్తికొండ కోడుమూరు నియోజక వర్గాల కోఆర్డినేటర్లు బి క్రాంతి నాయుడు, అనంతరత్నం మాదిగ, రాష్ట్ర ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా సెల్ జిల్లా అధ్యక్షులు డివి సాంబశివుడు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేంద్ర రెడ్డి, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, వార్డు ఇన్చార్జులు ఎన్ సుంకన్న హుస్సేన్ భాష, కేశవరెడ్డి, దస్తగిరి, కిషోర్ రంగస్వామి కర్నూల్ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు బొగ్గుల హైమవతి, మహిళా కాంగ్రెస్ ఏ లలిత సలోమి మొదలగువారు పాల్గొన్నారు.



## పంటలు నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలి

### గ్రీవెన్స్ లో బిజెపి నాయకులు జిల్లా కలెక్టర్ కు వినతి.

కిర్లంపూడి(విజయసారథి):కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం పలు గ్రామాలలో గత సీజన్లో ఏప్రియల్ ,మే నెలలో వచ్చిన భారీ వర్షాలకు వరి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో పలువు బిజెపి నాయకులు జిల్లా కలెక్టర్ కు సోమవారం గ్రీవెన్స్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లో సర్వే చేసి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అంచనా వేశారని,అప్పటి నుండి ఇప్పటి వరకు నష్ట పరిహారం అందించలేదని ఖరీఫ్ సీజన్లో పెట్టుబడులు పెట్టవలసి ఉన్నది కావున ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించి నష్టఇప్పించేలా కృషి చేయాలని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు కాకినాడలో జరిగిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో గోనేడ ఎంపీటీసీ మెంబర్, బిజెపి నాయకులు అల్లు శివరామకృష్ణ, రైతులు ఎల్లపు సూర్యనారాయణ, రాసం శెట్టి రాజా , పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## వైద్యకళశాలల నిర్మాణం పేరుతో 5వేల కోట్లు అప్పు

### జగన్ చేసిన ఆ అప్పు ఎక్కడికి మళ్లిందో

### టిడిపి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శలు

రాజమహేంద్రవరం,సెప్టెంబర్15: రాష్ట్రంలో వైద్య కళాశాలలు నిర్మిస్తామని జగన్ ప్రభుత్వం రూ.5వేల కోట్ల అప్పు చేసిందని.. ఆ నిధులు ఎటు మళ్లించారో సమాధానం చెప్పాలని తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అన్నట్టుగా రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేం. వైకాపా కార్యాలయాన్ని మాత్రం ఓహో అనేలా నిర్మించుకున్నారు. ప్రైవేటీకరణకు పీపీపీకి మధ్య వ్యత్యాసం తెలియని జగన్ ఐదేళ్లు సీఎంగా ఎలా పనిచేశారు. అనేక అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో పీపీపీ విధానంలోనే వైద్య కళాశాలలు కొనసాగుతున్నాయి. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా మెరిట్ సీట్లను కూటమి ప్రభుత్వం 42 నుంచి 50 శాతానికి పెంచింది. జగన్ అధికారంలో ఉండగా ఎందుకు పెంచలేదో వైకాపా సమాధానం చెప్పాలి. జగన్ మాపై బురద చల్లేసి కడుక్కోమంటు–న్నారు. ఫ్యాక్షన్ తరహాలో మెడికల్ కాలేజీల కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్య జగన్ ఉండటం శ్రేయస్కరం కాదు. రాష్ట్ర శ్రేయస్సు కోసం ఆయన జైలులో ఉండటమే మంచిది. జగన్ తరహాలోనే ఆయన శిష్యులు కూడా ఫేక్ మాటలు మాట్లాడుతున్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రోజురోజుకీ దిగజారిపోతున్నారని ఆదిరెడ్డి వాసు విమర్శించారు. గోదావరి పుష్కరాల పనులు డిసెంబర్ నుంచి ప్రారంభమవుతాయని ఆదిరెడ్డి వాసు తెలిపారు. రూ.1500 కోట్లతో అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగోసారి విజయం సాధించబోతున్నామని చెప్పారు.

## ముందుడి నడిపిస్తున్న మహిళలు

### అభివృద్ధిలో వారిదే అగ్రభాగం

### మహిళా సాధికార కమిటీ ఛైర్పర్సన్ పురందేశ్వరి



తిరుపతి,సెప్టెంబర్15 మహిళలు అభివృద్ధిని ముందుండి నడిపిస్తున్నారని భాజపా ఎంపీ, పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ– ఛైర్పర్సన్ పురందేశ్వరి అన్నారు.ప్రతిరంగంలోనూ వారు నిర్ణయాత్మక పాత్రపోషిస్తున్నారని అన్నారు. వారు ఏరంగంలోనైనా రాణించగలరని నిరూపిస్తున్నారని అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. మారుతున్న సమాజానికి ఈ సమావేశం ఓ నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలకు సమ న్యాయం, గౌరవ జీవితం ఇచ్చేందుకు ఇలాంటివి ఉపయోగపడతాయని తెలిపారు. వికసిత్ భారత్–2047 సాధనలో మహిళలు ముందుండి నడిపించాలి. విద్య, వైద్యం, పరిపాలన, వ్యాపార రంగాల్లో రాణించాలి. వృద్ధిలో భాగం కావడం కాదు.. ముందుండి నడిపించాలి. ఆశా కార్యకర్తల నుంచి ఐఏఎస్ వరకు మహిళల సంఖ్య పెరుగుతూ ఉంది. వర్క్ ఫోర్స్లో వారి సంఖ్య వృద్ధి చెందుతోంది. వారిని వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు 70 కేంద్ర, 400 రాష్ట్ర పథకాలు ఉన్నాయి. ప్రస్తుత భారత్ ఆర్థిక వృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT UTTEJITHA PRINTERS, H.No.801, BUDHAWARPETA, KURNOO 518001,A.P, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com